31వ వసంతంలోకి

# చురకలు

కరీంనగర్, జగిత్యాల, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల

శుక్రవారం 21 నవంబర్ 2025 పేజీలు : 8

## మావోయిస్టుల్లారా..జనజీవ స్రవంతిలో కలవండి

◆మల్లోజుల వేణుగోపాల్

చురకలు విలేఖరి,హైదరాబాద్, నవంబర్, 20 : 'దేశంలో పరిస్థితులు మారాయి. ఆయుధాల ద్వారా ఎదుర్కోవడం కష్టం. జనజీవన స్రవంతిలో కలవండి' అని అజ్ఞాతంలోని మావోయిస్టులకు లొంగిపోయిన మావోయిస్టు మాజీ అగ్రనేత మల్లోజుల వేణుగోపాల్ విజ్ఞప్తి చేశారు. వీడియో ద్వారా ఒక సందేశాన్ని విడుదల చేశారు. ఆంధ్రప్రదేశ్‌లో మావోయిస్టు అగ్ర నేత హిడ్మాతో పాటు ఆరుగురు సహచరులు చనిపోవడం తనకు బాధ కలిగించిందని పేర్కొన్నారు. తాము నెలన్నర కిందనే ఆయుధాలను వీడి జనజీవన స్రవంతిలో కలిశామని తెలిపారు.40 ఏండ్ల అజ్ఞాత జీవితంలో ఎన్నో కష్టాలను ఎదుర్కొన్నామనీ, ఎంతో మంది సహచరులను కోల్పోయామని



ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం దేశంలో పరిస్థితులు మారాయనీ, సాంకేతిక పరిజ్ఞానం విస్తృతంగా అభివృద్ధి చెందిన ఈ కాలంలో అడవుల నుంచి ఆయుధాల ద్వారా ఏదీ సాధించలేమని పేర్కొన్నారు. మిగతా వారు కూడా ఆయుధాలు వదిలి జనజీవన స్రవంతిలో కలవాలని విజ్ఞప్తి చేశారు.



# తిరుపతిపై టెన్షన్..టెన్షన్!

-పోలీసుల అదుపులో మావోయిస్టు దేవ్‌జీ లేరంటున్న ఏపీ ఆఫీసర్స్

-లొంగిపోనున్న ఆజాద్, నారాయణ?

-వారి వెంట మరో 20 మంది మావోలు

-పాక హన్మంతు,మళ్ళా రాజిరెడ్డి సేఫ్ గానే ఉన్నారా!

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్, 20:** మావోయిస్టు పార్టీకి ఇటీవల ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన తిప్పరి తిరుపతి అలియాస్ దేవ్‌జీ విజయవాడ పోలీసుల అదుపులో ఉన్నాడా? హిడ్మా ఎన్కౌంటర్లో మరణించిన తర్వాత తిరుపతి కోసం ఆయన కుటుంబీకులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.ఏపీలో పట్టుబడిన వారిలోని నలుగురు కీలక నేతల్లో అతను కూడా ఉన్నట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. ఏపీ పోలీసులు మాత్రం తిరుపతి తమ వద్ద లేరని చెబుతున్నారు. ఈ నేపథ్యంలో పోలీసుల మాటపై అనుమానాలు తొలగినప్పటికీ ఆయన మాత్రం ఎక్కడ ఉన్నా సరే లొంగిపోవాలని సోదరులు కోరుతున్నారు .లొంగుబాటు ప్రణాళికలో భాగంగా ఏఓబీ నుంచి హిడ్మా రావాల్సి ఉండగా, ముందుగానే తిప్పరి తిరుపతి విజయవాడకు వచ్చినట్లు ప్రచారం జరుగుతోంది.ఒకవేళ లొంగుబాటు ప్రయత్నాలు సఫలం కాకపోతే ఏపీ నుంచి తమిళనాడుకు వెళ్లేందుకు కూడా వారు ప్రణాళికలు రచించారని ప్రచారం జరుగుతున్నది. ఈ క్రమంలో దేవ్‌జీ పట్టుబడి ఉంటాడని అంటున్నారు. మరోవంక, తెలంగాణ రాష్ట్ర కమిటీ సభ్యుడు కొయ్యడ సాంబయ్య అలియాస్ ఆజాద్ నేతృత్వంలో భారీగా క్యాడర్ లొంగిపోయేందుకు ఏర్పాట్లు చేసుకున్నట్టు తెలిసింది. ఇటీవల ఆయన తెలంగాణ పోలీసులను సంప్రదించినట్టు సమాచారం. కొందరు మాత్రం ఇప్పటికే సాంబయ్య తో పాటు మరికొందరు తెలంగాణ పోలీసుల గూటికి చేరుకున్నరాని అంటున్నారు. కాగా నేడో రేపో ఆయనతోపాటు డివిజన్ కమిటీ సభ్యుడు అప్పాసి నారాయణ అలియాస్ రమేశ్, వారితో వచ్చిన క్యాడర్‌ను మీడియా ముందు ప్రవేశపెట్టనున్నారు. మావోయిస్టు పార్టీ తెలంగాణ రాష్ట్ర కమిటీలో కీలక సభ్యుడిగా, భద్రాద్రి కొత్తగూడెం, అల్లూరి సీతారామరాజు జిల్లాల డివిజన్ కమిటీ కార్యదర్శిగా ఆజాద్ కీలకంగా ఉన్నారు. వీరితోపాటు 20 మంది వరకు డివిజనల్, ఏరియా కమిటీల సభ్యులు లొంగిపోయేందుకు కార్యాచరణ పూర్తయినట్టు సమాచారం. ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం మొద్దులగూడేనికి చెందిన

-2లో

## యావర్ రోడ్డులోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి

◆సర్వే నంబర్ 138లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలి

◆అక్రమ నిర్మాణాలు తొలగిస్తే ప్రజలకు కొంతమేర ఇబ్బందులు తప్పుతాయి

◆నిబంధనలకు భిన్నంగా నిర్మించిన నిర్మాణాలన్నీ తొలగించాలి

◆మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి

**చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 20 :** జగిత్యాల పట్టణంలోని



యావర్ రోడ్డులోని అక్రమ నిర్మాణాలను తొలగించాలని,సర్వే నంబర్ 138లో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకోవాలని,అక్రమ నిర్మాణాలు తొలగిస్తే ప్రజలకు కొంతమేర ఇబ్బందులు తప్పుతాయని,నిబంధనలకు భిన్నంగా నిర్మించిన నిర్మాణాలన్నీ తొలగించాలని మాజీ మంత్రి టి.జీవన్ రెడ్డి అన్నారు.గురువారం జిల్లా కేంద్రంలోని ఇందిరా భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగిత్యాల పట్టణంలోని కొత్త బస్టాండ్ సమీపంలో సర్వే నంబర్ 138 లో 20 గుంటల భూమి ఆక్రమణ గురైందని, 1952లో పెట్రోల్, డీజిల్, కిరోసిన్ అవుట్ లెట్ నిర్వహణకు 20 గుంటల స్థలాన్ని కేటాయిస్తే, ఆ స్థలాన్ని ఇతర అవసరాలకు సైతం వినియోగిస్తున్నారని,2004లో మున్సిపల్ కౌన్సిల్ 1952లో కేటాయించిన భూమిని స్వాధీనం చేసుకోవడానికి తీర్మానం చేయగా,

2లో

## ప్రతిభకు పట్టం కట్టిన అల్ఫోర్స్ ట్రైనీ టాట్స్ ఇంటెలిజెన్స్



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** విద్యార్థులకు తరగతి గదిలోని విషయాలను చాలా సృజనాత్మకంగా మరియు ప్రయోగాత్మకంగా బోధించినట్లయితే వారికి విషయాలలో పట్టు వస్తుందని మరియు వివిధ పోటీ పరీక్షలకు ప్రాతినిధ్యం ఇవ్వగలుగుతారని అల్ఫోర్స్ విద్యాసంస్థల అధినేత డాక్టర్ వి. నరేందర్ రెడ్డి స్థానిక వావిలాలపల్లిలోని అల్ఫోర్స్ ట్రైనీ టాట్స్ ప్రాంగణంలో నిర్వహించినటువంటి అల్ఫోర్స్ ఇంటెలిజెన్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మనదేశంలోని సాంకేతిక రంగం చాలా విజయాలు సాధిస్తుందని మరియు ఎన్నో నూతన ఆవిష్కరణలకు వేదిక అవుతుందదని హర్షం వ్యక్తం చేశారు విద్యార్థుల విషయాల పట్ల సమగ్రంగా బోధించాలని మరియు పలు విషయాలలో నైపుణ్యం సాధించే విధంగా విద్యార్థులకు చక్కటి విద్యను అందించడమే లక్ష్యంగా పాఠశాలలో పాఠ్యాంశ ప్రణాళికలో భాగంగా వివిధ కార్యక్రమాలను రూపొందిస్తూ అమలుపరుస్తున్నామని ఆ కార్యక్రమా లను భాగంగా నేడు పాఠశాలలో వేడుకగా అల్ఫోర్స్ ఇంటెలిజెన్స్ ప్రారంభించడం జరిగిందని తెలుపుతూ ఈ ప్రదర్శన ద్వారా విద్యార్థులకు చాలా విషయాలు తెలుస్తాయని మరియు ఆసక్తికరమైన విషయాలు సైతం తెలుసుకుంటారని వారు చెప్పారు.ప్రధానంగా విద్యార్థులకు వినోదంతో పాటు చదువు పట్ల ప్రత్యేక కార్యక్రమాలను రూపొందించడం జరిగిందని వారు చెప్పారు. ప్రదర్శన లో భాగంగా విద్యార్థులు ప్రదర్శించినటు వంటి గ్రామర్ సిటీ,ఆదర్శనీయమైన కథలు,మ్యాథ్స్ మానియా,ఆరోగ్యకర మైన ఆహారం - జంక్ ఫుడ్,వాటర్ సైకిల్,వంట చేసే విధానాలు,అగ్నిపర్వతాల ప్రభావం, గ్రహణం,సునామి,దేశంలోని విద్యా విధానాలు,అభివృద్ధి

2లో

## వరి ధాన్యం కొనుగోళ్లను త్వరితగతిన పూర్తి చేయాలి

**-మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్**



**చురకలు విలేఖరి,పెగడపల్లి నవంబర్ 20 :** కొనుగోలు కేంద్రాల్లో నిల్వ ఉన్న వరి ధాన్యాన్ని తూకం వేసి త్వరితగతిన పూర్తి చేయాలని పెగడపల్లి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బుర్ర రాములు గౌడ్ సూచించారు. జగిత్యాల జిల్లా పెగడపల్లి మండలంలోని రాజారాం పల్లి గ్రామంలో ఐకెపి ద్వారా నిర్వహిస్తున్న వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పెగడపల్లి ఏపిఎం రవివర్మ తో కలిసి మార్కెట్ కమిటీ చైర్మన్ రాములు గౌడ్ గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఎంసి చైర్మన్ మాట్లాడుతూ....వరి ధాన్యాన్ని త్వరగా తూకం వేసి, త్వరగా మిల్లులకు తరలించి కొనుగోళ్లు పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. రంగు మారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వమే కొనుగోలు చేస్తుందని, రైతులు ఎలాంటి అయోమయానికి గురి కావద్దని భరోసా కల్పించారు.సన్నరకం వరి ధాన్యాన్ని కూడా ప్రభుత్వమే సేకరిస్తుందని వివరించారు.ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సురకంటి సత్తిరెడ్డి, డైరెక్టర్ చాట్ల విజయభాస్కర్, ఐకెపి కొనుగోలు కేంద్రం నిర్వాహకులు లత, నాయకులు సంపత్ కుమార్, మంద శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

## ప్రతిభకు పట్టం కట్టిన అల్ఫోర్స్ టైనీ టాట్స్ ఇంటెలిజెన్స్



**మొదటి పేజీ తరువాయి...**ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలు తదితర అంశాలు ఏర్పాటు చేసినటువంటి పలు సమాచార పట్టికలు ఆలోచింపచేసాయి.చక్కటి కార్యక్రమాల రూపొందిస్తూ విద్యార్థుల దాగిన ప్రతిభను వెలికి తీస్తున్న యజమాన్యానికి తల్లిదండ్రులు ధన్యవాదాలు తెలియజేశారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు పాల్గొన్నారు.

## యావర్ రోడ్డులోని అక్రమ నిర్మాణాలను తొలగించాలి

**మొదటి పేజీ తరువాయి...** అక్రమణదారులు హైకోర్టును ఆశ్రయించారని, హైకోర్టు మున్సిపల్ తీర్మానాన్ని రద్దుచేసి, భూ యజమాన్య హక్కులను నిరూపించుకోవాలని తీర్పునిచ్చిందన్నారు. 2008 నుండి నేటి వరకు భూ యజమాన్య హక్కులను నిరూపించుకోవడానికి ఎలాంటి ప్రయత్నం చేయలేదని, వారు ఎలాంటి భూ యజమాన్య హక్కులను కలిగి లేరని, భూ యజమాన్య హక్కులను కలిగి ఉంటే ఒరిజినల్ కిబాలను హైకోర్టులో ఎందుకు దాఖలు చేయలేదని ప్రశ్నించారు. ఆక్రమణదారులు కోర్టులో సమర్పించిన కిబాల ప్రతి సృష్టించారా అనే అనుమానాలు కలుగుతున్నాయన్నారు. ఈ వివాదంపై జిల్లా కలెక్టర్ ఓ కమిటీని ఏర్పాటు ప్రభుత్వ భూమిని తిరిగి స్వాధీనం చేసుకోవడానికి న్యాయ సలహా కోసం వేచి చూస్తున్నట్లు తెలిపారు. 2008 డివిజన్ బెంచ్ తీర్పుకు అనుగుణంగా ఉన్న నిర్మాణాలను తొలగించవద్దని, అక్రమణదారులు మున్సిపల్ అధికారులతో కుమ్మక్కై నూతన నిర్మాణాలను నిర్మించారని, భూ యజమాన్య హక్కులు లేనప్పుడు నిర్మాణానికి అనుమతులు ఎలా ఇచ్చారని, నిబంధనలకు భిన్నంగా అనుమతులు ఇచ్చిన అధికారులపై చర్యలు తీసుకోవాలని, ఒకవేళ అధికారులు పదవి విరమణ పొందితే వారి రిటైర్మెంట్ బెనిఫిట్స్, పెన్షన్ ను నిలిపివేయాలన్నారు. కొందరు ఇంటి నిర్మాణ అనుమతులు తీసుకొని, వాణిజ్యపరమైన నిర్మాణాలు చేపట్టారని అలాంటి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కు లేఖ రాసినట్లు తెలిపారు.

# టిడబ్ల్యూజేఎఫ్‌తో బసవపున్నయ్యకు సంబంధం లేదు

**-ఫెడరేషన్ నుంచి అతన్ని తొలగించాం**
**-ఫెడరేషన్ పేరుతో కార్యకలాపాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు**




**హైదరాబాద్, నవంబర్ 20:** తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్)తో బసవపున్నయ్య అనే వ్యక్తికి ఎలాంటి సంబంధం లేదని, సంఘ వ్యతిరేక చర్యలకు పాల్పడినందున ఆయనను ఫెడరేషన్ నుంచి తొలగించడం జరిగిందని ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షు, రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ కన్వీనర్ మామిడి సోమయ్య తెలిపారు. ఈనెల 15న హైదరాబాద్ లో జరిగిన రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో దాదాపు 30 జిల్లాల నుంచి 130 మంది రాష్ట్ర ఆఫీస్ బేరర్లు,కార్యవర్గ సభ్యులు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు,రాష్ట్ర కౌన్సిల్, నేషనల్ కౌన్సిల్ సభ్యులు, సంఘం వ్యవస్థాపక సభ్యులు హాజరయ్యారని, ఈ సమావేశంలో బసవపున్నయ్యను ఫెడరేషన్ నుంచి శాశ్వతంగా తొలగిస్తూ ఏకగ్రీవ తీర్మానం ఆమోదించారని ఆయన తెలిపారు. గురువారం హైదరాబాద్ లోని ఎన్ ఎస్ ఎస్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఫెడరేషన్ రాష్ట్ర మాజీ ఉపాధ్యక్షులు, కన్వీనింగ్ కమిటీ కో-కన్వీనర్లు వల్లాల జగన్, బండి విజయ్ కుమార్, నేషనల్ కౌన్సిల్ సభ్యుడు ఎం. పద్మనాభ రావులతో కలిసి పలు విషయాలను వెల్లడించారు. గత పదేళ్లుగా సంఘానికి వచ్చిన సభ్యత్వ రుసుము ఎంతో చెప్పకుండా, డైరీ, మ్యాగజిన్ ద్వారా వచ్చిన ఆదాయం లెక్కలు చూపకుండా, జిల్లాల మహాసభలు జరపకుండా అడ్డుకుంటూ సంఘాన్ని విచ్చినం చేస్తున్న బసవ పున్నయ్య ప్రాథమిక సభ్యత్వాన్ని రద్దుచేసి ఆయనను ఫెడరేషన్ నుండి తొలగించినట్లు తెలిపారు. ఇక నుంచి టీడబ్ల్యూజేఎఫ్ కు బసవపున్నయ్యకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. ఇటీవల రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశంలో ఏకగ్రీవ ఆమోదంతో ఏర్పడిన ఫెడరేషన్ రాష్ట్ర కన్వీనింగ్ కమిటీ అనుమతి లేకుండా బసవపున్నయ్య గానీ, ఇతరులు గానీ ఫెడరేషన్ పేరుతో ఎలాంటి కార్యక్రమాలు, కార్యకలాపాలు నిర్వహించరాదని అన్నారు. అంతేకాకుండా రాష్ట్ర కమిటీ రద్దయిందని, మళ్ళీ రాష్ట్ర మహాసభ జరిగేంత వరకు రాష్ట్ర కార్యవర్గం ఉండదని,ఎవరికీ ఎలాంటి పదవులు ఉండవని ఆయన స్పష్టం చేశారు. సంఘం కార్యకలాపాలు అనగా జిల్లా, రాష్ట్ర స్థాయిలో సభ్యత్వ నమోదు, మహాసభలు, ఎన్నికల నిర్వహణ కోసం రాష్ట్ర కన్వీనింగ్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. రాష్ట్ర కమిటీ రద్దయినప్పటికీ కొందరు తమ పదవులను ఇంకా వాడుకుంటూ, టీడబ్ల్యూజేఎఫ్ పేరుతో కార్యక్రమాలు చేస్తున్నట్లు తెలుస్తుందని, ఇలాంటి చర్యలకు పాల్పడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఫెడరేషన్ పేరుతో కార్యక్రమాలు చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకునే బాధ్యతలురాష్ట్ర కన్వీనింగ్ కమిటీకి అప్పగించడం జరిగిందని, అదే విధంగా ఇటీవల పలు జిల్లాల్లో సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు, వ్యవస్థాపక సభ్యుల ఆధ్వర్యంలో జరిగిన జిల్లా మహాసభల్లో ఎన్నికైన జిల్లా కమిటీలన్నీ యధావిధిగా కొనసాగుతాయని రాష్ట్ర విస్తృత స్థాయి సమావేశం ప్రకటించిందని మామిడి సోమయ్య తెలిపారు. ఫెడరేషన్ సభ్యులు, ఇతర జర్నలిస్టులు ఈ విషయాన్ని గమనించాలని కోరారు. ఫెడరేషన్ సంఘానికి ఇంకా తానే ప్రధాన కార్యదర్శినంటూ తిరుగుతున్న బసవపున్నయ్య చెప్పే మాయ మాటలు నమ్మి జర్నలిస్టులు మోసపోవద్దని సూచించారు. ఆయన నిర్వహించే కార్యక్రమాలు కేవలం ఆయన పనిచేస్తున్న నవతెలంగాణ పత్రికకు సంబంధించినవి మాత్రమేనని, ఫెడరేషన్ కు ఎలాంటి సంబంధం లేదని ఆయన స్పష్టం చేశారు. ఫెడరేషన్ ను కేవలం నవతెలంగాణ పత్రిక జర్నలిస్టులకే పరిమితం చేసి, ఆ పత్రిక ప్లాంట్ యూనియన్ గా మార్చి తన సొంతం చేసుకోవాలని చూస్తున్నారని,ఈ కుట్రలను ఫెడరేషన్ సభ్యులంతా తిప్పికొట్టాలని ఆయన పిలుపునిచ్చారు. సంఘం నుంచి బహిష్కరణకు గురైన బసవపున్నయ్య,పిల్లి రాంచందర్ లు రేపు రాష్ట్రవ్యాపితంగా కలెక్టర్లకు వినతి పత్రాలు ఇచ్చే కార్యక్రమానికి పిలుపు ఇవ్వడం చట్టవిరుద్ధమని అన్నారు. కేవలం తమ ఉనికిని చాటుకునేందుకు బసవపున్నయ్య వేరు కుంపటి పెట్టి సంఘాన్ని విచ్చిన్నం చేయడానికి ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ఆయన చేస్తున్న కార్యక్రమాలకు గానీ, సమావేశాలకు గానీ టీడబ్ల్యూజేఎఫ్ కు సంబంధం లేదని, సంఘం సభ్యులు ఎవరు కూడా ఆయన సొంత కార్యక్రమాలకు వెళ్ళవద్దని మామిడి సోమయ్య కోరారు.

# తిరుపతి పై టెన్షన్..టెన్షన్ !!

**మొదటి పేజీ తరువాయి...** ఆజాద్ 1995లోనే అజ్ఞాతంలోకి వెళ్లారు. రాష్ట్రకమిటీ కార్యదర్శి హరిభూషణ్ మృతి తర్వాత ఆ హోదా కోసం ఆజాద్, మరో రాష్ట్రకమిటీ సభ్యుడు బడే చొకారావు అలియాస్ దామోదర్ మధ్య పోటీ నెలకొంది. ఇప్పుడిది రాజకీయ వైరం సమస్య కాదు.దీంతో అప్పట్లో చంద్రన్న నేతృత్వంలోనే తెలంగాణ కమిటీని కొనసాగించారు. ఇటీవల దామోదర్‌ను రాష్ట్రకమిటీ కార్యదర్శిగా నియమించగా.. మారిన పరిస్థితుల కారణంగా ఆజాద్ లొంగిపోయేందుకు సిద్ధమైనట్టు తెలిసింది. అతనితోపాటు పెద్దపల్లి జిల్లా రామగుండం మండలం ఎఫ్‌సీఐ ప్రాంతానికి చెందిన రమేశ్ తెలంగాణ రాష్ట్ర కమిటీ టెక్నికల్ టీమ్ ఇన్‌చార్జిగా ఉన్నారు.కాగా, ఏపీ పోలీసులు పలుచోట్ల నిర్వహించిన సోదాల్లో మొత్తం 50 మందికి పైగానే అరెస్టు చేసిన పోలీసులు వారిని అదుపులోకి తీసుకుని విచారించి,రిమాండ్ కు పంపించారు.మంగళవారం ఉదయం హిడ్మా ఎన్‌కౌంటర్ తర్వాత ఆ వెంటనే ఏపీలోని పలు చోట్ల పోలీసులు మెరుపు దాడులు చేశారు. విజయవాడ పెనుమలూరులోని ఒక భవనంలో ఏలూరులోని ఒక అపార్ట్‌మెంట్‌లో.. కాకినాడలోని ఒక ఇంటివద్ద కూడా గ్రేహౌండ్స్, ఆక్టోపస్ పోలీసులు చుట్టుముట్టి సోదాలు చేశారు.విజయవాడ పెనుమలూరు సమీపంలోని న్యూ ఆటోనగర్‌లోని ఓ అద్దె భవనంలో మొత్తం 31 మంది మావోయిస్టులు పట్టుబడ్డారని అధికారులు స్వయంగా వెల్లడించారు. అందులో మహిళలే ఎకువగా ఉన్నారని.. ఎకువమంది ఛత్తీస్‌గఢ్ రాష్ట్రానికి చెందిన మావోయిస్టులు అని ఇంటెలిజెన్స్ చీఫ్ మహేశ్ చంద్ర లడ్డా తెలిపారు. పట్టుబడిన వారిలో కీలక నేతలు ఉన్నట్లు కృష్ణా జిల్లా ఎస్పీ తెలిపారు. వీరంతా పెద్ద నేతలకు రక్షణగా ఉండే ఆర్మీ టీం సభ్యులని కూడా అధికారులు తెలిపారు. పట్టుబడిన వారిలో దేవ్ జీకి రక్షణగా ఉండే వారు 9 మంది ఉండటంతో అతను కూడా పోలీసుల అదుపులోనే ఉన్నాడనే అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు మాత్రం పట్టుబడిన కీలక నేతల పేర్లు వెల్లడించలేదు. ప్రస్తుతం వారందరినీ ఆక్టోపస్, టాస్ ఫోర్స్ కార్యాలయాలకు తరలించారు. ఏలూరులో నిర్వహించిన సోదాల్లో 12 మంది మావోయిస్టులు పట్టుబడ్డారు. కాకినాడ, తిరుపతిలో కూడా కొందరిని అరెస్టు చేశారని, వారిని నేడు మీడియా ముందు ప్రవేశపెట్టే అవకాశం ఉందని సమాచారం. కాగా తిరుపతికి సంబంధించిన ప్రచారాన్ని పోలీసులు నిర్ధారించలేదు.మరోవంక, ఆపరేషన్ కగార్‌తో వరుస ఎన్ కౌంటర్లు, అగ్రనేతల మృతితో ఛత్తీస్‌గఢ్ నుంచి మావోయిస్టులు ఆంధ్రప్రదేశ్ వైపు వచ్చారన్న సమాచారంతో కొంతకాలంగా పోలీసులు నిఘా పెట్టారు. ఈ క్రమంలో ఏకకాలంలో రాష్ట్రంలోని అల్లూరి, కాకినాడ, ఎన్టీఆర్, కృష్ణా, ఏలూరు జిల్లాల్లో ఇంటెలిజెన్స్, ఆక్టోపస్ బృందాలు ఆపరేషన్ చేపట్టాయి. ఇప్పటివరకు విజయవాడలో 28, కాకినాడలో 2, ఏలూరులో 15 మందిని మిగతా ప్రాంతాల్లో మరికొంతమందితో కలుపుకుని మొత్తంగా రాష్ట్రంలో 50 మందికి పైగా మావోయిస్టులను అరెస్టు చేశారు. అలానే రాష్ట్రవ్యాప్తంగా మావోయిస్టు డంప్‌ల కోసం గాలింపు కొనసాగుతుంది. హిడ్మా డైరీ ఆధారంగా రాష్ట్రవ్యాప్తంగా పోలీసుల సోదాలు నిర్వహిస్తున్నారు.ఉమ్మడి కరీంనగర్ జిల్లా కోరుట్ల దేవ్ జీ స్వస్థలం. తిప్పిరి తిరుపతి దాదాపు 43 ఏండ్ల క్రితం అజ్ఞాతంలోకి వెళ్లారు. గణపతి కార్యదర్శిగా పీపుల్స్‌వార్ పార్టీ తన ప్రస్తానాన్ని కొనసాగించిన క్రమంలో మల్లోజుల కోటేశ్వర్‌రావు, నల్లా ఆదిరెడ్డి, శీలం నరేశ్, పులి అంజన్న, ఎర్రంరెడ్డి సంతోష్‌రెడ్డి, నంబాల కేశవరావు, మాధవ్, తిప్పిరి తిరుపతి కీలక భూమిక పోషించారు. పీపుల్స్‌వార్‌లో దళ సభ్యుడిగా ప్రస్థానం మొదలుపెట్టిన తిరుపతి, పార్టీలో కార్యదర్శి గా ఎదిగారు.ఇప్పుడు మావోయిస్టు ప్రాబల్యం ఎక్కువగా ఉండే ప్రాంతంలో తిరుపతి కదలికలు,రక్షణపై కలవరం నెలకొంది.

# సామాజిక అంశాలపై జిల్లా పోలీస్ కళాబృందం అవగాహన



చురకలు ప్రతినిధి,కోరుట్ల,నవంబర్ 20 : జగిత్యాల జిల్లా ఎస్పీ అశోక్ కుమార్ ఆదేశాల మేరకు బీర్పూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో, కోరుట్ల మండలం మోహన్రావుపేట గ్రామంలో పోలీస్ కళాబృందం ప్రదర్శనలు నిర్వహించారు. ఈ సందర్భంగా సైబర్ నేరాలు, గంజాయి నిర్మూలన, మూఢనమ్మకాల నివారణ, ఆత్మహత్యల సమస్య, రోడ్డు ప్రమాదాలు- ట్రాఫిక్ నియమాలు పాటించడం, గల్ఫ్ ఏజెంట్ మోసాలు, సైబర్ మోసాల నివారణ, గ్రామాల్లో సీసీ కెమెరాల అవసరం వంటి సామాజిక సమస్యలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం కోరుట్ల ఎస్ఐ చిరంజీవి మాట్లాడుతూ ఈ మధ్యకాలంలో సైబర్ నేరాలు విపరీతంగా పెరుగుతున్నాయని, ఎవరికైనా మోసపోయినట్లయితే వెంటనే 1930 నంబరకు ఫిర్యాదు చేయాలని సూచించారు. గ్రామాల్లో సీసీ కెమెరాలు ఏర్పాటు వల్ల నేరాలను అరికట్టడంలో ఎంతో ఉపయోగకరంగా ఉందని, అందుకు గ్రామస్తులు సహకరించాలని కోరారు. తల్లితండ్రులు పిల్లలను ఉన్నత విద్యకు ప్రోత్సహించాలని,యువత చెడు వ్యసనాలకు అలవాటు పడకూడదని తెలిపారు.వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేయకూడదని, లైసెన్స్ లేకుండా వాహనాలు నడపరాదని, హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని సూచించారు. గ్రామాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనబడితే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, ఏ చిన్న సమస్య ఉన్నా పోలీస్ స్టేషన్కు తెలియజేయాలని సూచించారు. చిన్నచిన్న తగాదాలు పెద్ద సమస్యలుగా మారకుండా జాగ్రత్త పడాలని,, నేరరహిత గ్రామాల కోసం ప్రజలు సహకరించాలని పిలుపు నిచ్చారు. మంత్రాలు తంత్రాలు వంటి మూఢనమ్మకాలను నమ్మరాదని స్పష్టం చేశారు. అత్యవసర పరిస్థితుల్లో 100 కు కాల్ చేస్తే పోలీసులు నిమిషాల్లో స్పందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం లో పోలీసు సిబ్బంది,పోలీస్ కళా బృందం సభ్యులు గ్రామస్తులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యే సంజయ్ ఏపార్టీలో ఉన్నారో చెప్పాలి

**-పార్టీ మారకపోతే జిల్లా బిఆర్ఎస్ కార్యాలయానికి రావాలి**

**-బిఆర్ఎస్ కండువా కప్పడానికి తాము సిద్ధంగా ఉన్నాం**

**-జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు**



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 20 : జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్ ఏపార్టీలో ఉన్నారో చెప్పాలని, పార్టీ మారకపోతే జిల్లా బిఆర్ఎస్ కార్యాలయానికి రావాలని, బిఆర్ఎస్ కండువా కప్పడానికి తాము సిద్ధంగా ఉన్నామని జిల్లా బిఆర్ఎస్ అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు అన్నారు. గురువారం జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బీర్ పూర్ మండలం తాళ్లధర్మారం గ్రామంలో ఎమ్మెల్యే డా. సంజయ్ పర్యటించగా బిఆర్ఎస్ కార్యకర్త నారసాక రవీందర్ బిఆర్ఎస్ పార్టీ కండువా కప్పడానికి వెళ్తే పోలీసులు అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.ఎమ్మెల్యే డా.సంజయ్ తాను పార్టీ మారలేదని అంటున్నారని, ఆయన వెంటనే జిల్లా బిఆర్ఎస్ పార్టీ కార్యాలయానికి రావా లని,ఆయనకు బిఆర్ఎస్ కండువా కప్పడానికి సిద్ధంగా ఉన్నామని తమ సవాల్ను ఎమ్మెల్యే స్వీకరించాల న్నారు. అనంతరం మాజీ జడ్పీ చైర్పర్సన్ దావ వసంత మాట్లాడుతూ ఎమ్మెల్యే డా. సంజయ్ బిఆర్ఎస్ పార్టీ ద్వారా గెలిచి కాంగ్రెస్ పార్టీలో చేరితే అనర్హత వేటు పడుతుందని,అందుకే ఆయన బిఆర్ ఎస్ పార్టీలోనే ఉన్నానని అంటున్నారని, మరి బిఆర్ఎస్ పార్టీ సమావేశాలకు ఎందుకు హాజరు కావడం లేదని, జూబ్లీహిల్స్ కాంగ్రెస్ అభ్యర్థి గెలుస్తే ఎమ్మెల్యే అనుచరులు ఎందుకు గెలుపు సంబరాలు జరుపుకున్నారో సమాధానం చెప్పాలన్నారు. ఎమ్మెల్యే డా. సంజయ్ తాము విసిరినా సవాల్ను స్వీకరించి బిఆర్ఎస్ పార్టీ కండువాను కప్పుకో వాలని లేనిపక్షంలో ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో మాజీ కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, ఆవారి శివకేసరి బాబు,పిఏసిఎస్ చైర్మన్ మహిపాల్ రెడ్డి,నాయకులు తుమ్మ గంగాధర్,అయిల్నేని ఆనంద్రు, వెంకటేశ్వర్రావు,ప్రతాప్,హరీష్ పాల్గొన్నారు.

# గ్రామాల అభివృద్దే తన ధ్యేయం

**-జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్**



చురకలు ప్రతినిధి, జగిత్యాల, నవంబర్ 20 : గ్రామాలను అభివృద్ధి చేయడమే తన ధ్యేయమని జగిత్యాల ఎమ్మెల్యే డా.సంజయ్ కుమార్ అన్నారు. గురువారం జగిత్యాల రూరల్ మండలం జాబితాపూర్ గ్రామంలో ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 18 లక్షలతో అభివృద్ధి పనులకు భూమి పూజ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలోనే అత్యధిక నిధులు జగిత్యాల నియోజకవర్గానికి మంజూరు అయ్యాయన్నారు. ఎస్సీ సబ్ ప్లాన్ నిధులు 11.50 కోట్లు జగిత్యాల కు మంజూరయ్యాయని, గ్రామంలో కాన్ చెరువుకు తూమ్ పెట్టి రైతు సాగు నీటి సమస్య పరిష్కారానికి కృషి చేయటం జరిగిందన్నారు. జగిత్యాలకు అత్యధిక సామర్థ్యం గల గోదాంల మంజూరు చేసుకోవడం జరిగిందని, జాబితా పూర్ గ్రామంలో సైతం కోట్ల నిధులతో నిర్మాణం కొనసాగుతుందన్నారు. గోదాం ఏర్పాటు వల్ల ధాన్యం నిల్వ చేసు కోవచ్చని,తద్వారా బ్యాంకు లోన్ తీసుకునే అవకాశం ఉందని,డిమాండ్ తగ్గట్లు నిల్వ చేసిన పంట ఉత్పత్తులు అమ్మి రైతులు లాభం పొందవచ్చన్నారు. కాటమయ్య కిట్లతో కల్లు గీత కార్మికుల కు భద్రత ఉందన్నారు.గ్రామంలో నూతన గ్రామపంచాయతీ భవనానికి నిధులు మంజూరు చేశామని,పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణానికి నిధులు మంజూరు చేస్తానన్నారు.తెలంగాణ ప్రభుత్వం ఉచిత కరెంట్,సన్న బియ్యం పంపిణీ, రేషన్ కార్డులు, ఇందిరమ్మ ఇళ్లు ఇలా అనేక సంక్షేమ పథకాలను ప్రభుత్వం అమలు చేస్తుందన్నారు. గ్రామంలో దాదాపు 50 మందికి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు అయ్యా యని, 22 మందికి లక్ష చొప్పున వారి ఖాతాల్లో జమ కూడా అయ్యాయన్నారు. ఇందిరమ్మ ఇళ్ళ లబ్ధిదారులకు మహిళా సంఘాల ద్వారా 1 లక్షలోన్ సదు పాయం కూడా ఉందన్నారు. అర్హులు అందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేస్తామని, అభివృద్ధి కోసం అందరితో కలిసి పనిచేస్తానన్నారు. కొందరు కావాలని బురద జల్లే ప్రయత్నం చేస్తున్నారని,ప్రజలు గమనిస్తున్నా రన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ జడ్పీటీసీ ముస్కు ఎల్లారెడ్డి,సెండెం నాగలక్ష్మి రాములు,ఎంపిడివో రమాదేవి ,డిఈ మిలింద్,ఎంపివో రవి బాబు,ఏఈ రాజమల్లయ్య, మాజీ సర్పంచ్ అంకం సతీష్, సీనియర్ నాయకులు బాల ముకుందం నక్కల రవీందర్ రెడ్డి, హరి కిషన్ రావు, రాజ గౌడ్, నరేష్, తిరుపతి, గంగారం, గ్రామ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ధాన్యం కొనుగోలు సెంటర్లు తనిఖీ చేసిన అదనపు కలెక్టర్



చురకలు,విలేఖరి, వెల్గటూర్,నవంబర్ 20 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం శాఖపూర్, ముక్కట్రా రావుపేట పిఏసిఎస్ ఆధ్వర్యం లో నిర్వహిస్తున్న ధాన్యం కొను గోలు సెంటర్లను జగిత్యాల జిల్లా అడిషనల్ కలెక్టర్ బిఎస్ లత గురువారం సంబంధిత అధికా రులతో కలిసి తనిఖీ చేశారు.రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండ దాన్యం కొనుగోళ్లు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. సెంటర్ల నిర్వాహ కులు,రైతులతో మాట్లాడి పలు సూచనలు చేశారు.కార్యక్రమంలో తహసీల్దార్ శేఖర్,డిటిసిఎస్ ధర్మపురి విష్ణు,ఏఈఓ నర్సింహ స్వామి తదితరులు పాల్గొన్నారు.

## జి పి పంప్ ఆపరేటర్ మృతి



చురకలు,విలేఖరి,వెల్గటూర్,నవంబర్ 20 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండల కేంద్ర గ్రామ పంచాయతీ పంపు ఆపరేటర్, ఎలక్ట్రీ షియన్ గా గత కొన్నేళ్లుగా విధులు నిర్వహిస్తున్న రాజక్కపల్లి గ్రామానికి చెందిన పత్తిపాక రవి అనారోగ్యంతో గురువారం మృతి చెందాడు. ఈయన మృతి పట్ల గ్రామ పంచాయతీసిబ్బంది, పలువురు గ్రామస్తులు తమ ప్రగాఢ సంతాపం వ్యక్తం చేశారు.

## కిషన్ రావుపేట ప్రభుత్వ పాఠశాల విద్యార్థుల ప్రతిభ



చురకలు,విలేఖరి,వెల్గటూర్, నవంబర్ 20 : జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం కిషన్రావుపేట్ ఉన్నత ప్రాథమిక పాఠశాలలో సమ్మేటివ్ అసెస్మెంట్ వన్ పరీక్షల్లో విద్యార్థులు అత్యున్నత ప్రతిభ కనబరిచడంతో ప్రథమ,ద్వితీయ విద్యార్థులను గుర్తించి ఫస్ట్ ఇన్ క్లాస్, సెకండ్ ఇన్ క్లాస్ బ్యాడ్జీలను ప్రగతి పత్రాలను పాఠశాల ప్రధానోపాధ్యాయులు నర్మల గంగన్న గురువారం అందజేశా రు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశా లలో నాణ్యమైన విద్య అందించ డానికి అంకితభావంతో పనిచేసే ఉపాధ్యాయులతో విద్యార్థులు అన్ని రంగాలలో నైపుణ్యాలు పెంపొందించుకుంటున్నారని,ప్రభుత్వ పాఠశాలలు బలోపే తం కావడానికి బడి ఈడు పిల్లలను మన ఊరి బడిలోనే చేర్పించాలని కోరారు. భవిష్యత్ లో ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే ఉన్నత స్థానాల్లో నిలుస్తారని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ చైర్మన్ సత్యవతి ఉపాధ్యాయులు మునీంద్ర,వనిత,శిరీష,భవాని,జైసింగ్ విద్యార్థుల తల్లిదండ్రులు, పాల్గొన్నారు.

## రౌడీషీటర్లకు కౌన్సిలింగ్



చురకలు విలేకరి, ధర్మపురి, నవంబర్ 20 : ధర్మపురి పట్టణంలోని పోలీస్ స్టేషన్లో గురువారం ధర్మపురి మండలానికి చెందిన రౌడీ, సస్పెక్ట్ షీటర్లకు ధర్మపురి ఎస్ఐ మహేష్ ఆధ్వర్యంలో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ రౌడీ,సస్పెక్ట్ షీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని,అవాంఛనీయ సంఘటనలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలి

**-జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్**



**చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 20 :** రైతులకు ఇబ్బందుల తలెత్తకుండా వరి ధాన్యం కొనుగోళ్ళు చేపట్టాలని జగిత్యాల జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ పేర్కొన్నారు. గురువారం మల్లాపూర్ మండలంలోని ముత్యంపేట, రాఘవపేట, ఓబులాపూర్ గ్రామాల్లో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా కలెక్టర్ సత్యప్రసాద్ తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ధాన్యంలో తేమశాతాన్ని పరిశీలించారు. 17 శాతం కంటే తక్కువ తేమ ఉంటే వేగంగా కొనుగోలు వేగంగా చేయాలన్నారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని త్వరితగతిన మిల్లులకు తరలించాలనీ, ట్రక్‌షీట్లలోనమోదైన ధాన్యం వివరాలను తనిఖీ చేసి, గత సారి వచ్చిన వడ్లతో పోల్చి ప్రస్తుత సీజన్ రికార్డులను విశ్లేషించారు. రైతులతో మాట్లాడి వారి అభిప్రాయాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఇప్పటి వరకు చేరిన మొత్తం ధాన్యం, ఎంత ధాన్యం రావాల్సి ఉంది అనే అంశాలను సమీక్షించారు. కేంద్రాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులకు సూచించారు. రైతులు ఎక్కువసేపు వేచి ఉండకుండా వేగవంతమైన కొనుగోలు చర్యలు చేపట్టాలని ఆదేశించారు. అలాగే కొనుగోలు చేసిన ధాన్యాన్ని తక్షణమే రైస్‌మిల్లులకు తరలించేలా రవాణా వ్యవస్థను బలోపేతం చేయాలని, లారీ రవాణాలో ఎలాంటి షార్టేజ్ లేకుండా నిశితమైన పర్యవేక్షణ ఉండాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మెట్ పల్లి ఆర్డీవో శ్రీనివాస్, డీసీఓ మనోజ్ కుమార్, తహశీల్దార్ రమేష్ నాయబ్ తహసీల్దార్ శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.

# రైతుల కష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణం

**-బిఆర్ఎస్ హాయంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నాం**

**-మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్**



**చురకలు విలేకరి, కొడిమ్యాల, నవంబర్ 20 :** రైతుల కష్టాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలే కారణమని, బిఆర్ఎస్ హాయంలో రైతులను కంటికి రెప్పలా కాపాడుకున్నామని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వానికి ఎన్నికలపై ఉన్న శ్రద్ధ రైతుల పై లేదన్నారు. నాడు మాజీ సీఎం కేసిఆర్ రైతులు పండించిన పంటలను ఎలాంటి ఆంక్షలు లేకుండా కొనుగోలు చేసి రైతులకు అండగా నిలిచారని గుర్తు చేశారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం ధాన్యం కొనుగోళ్లలో ఆంక్షలు విధించడం సరికాదని, రైతుల ధాన్యం డబ్బులు చెల్లించడం ఆలస్యమవుతుందని, బోనస్ విషయం దేవుడెరుగు అని, రైతుల సమస్యలను వెంటనే పరిష్కరించకపోతే ఆందోళనలు చేపడుతామన్నారు.

# భక్తి శ్రద్ధలతో ధర్మపురిలో గోదావరి మహా హారతి

**రామ కిష్టయ్య సంగన భట్ల...**

కార్తీక బహుళ అమావాస్య పర్వదిన సందర్భంగా, ధర్మపురి క్షేత్రంలో గోదావరి నది వద్ద కార్తీక దీపారాధనా మహోత్సవం గురువారం రాత్రి నేత్ర పర్వంగా జరిగింది. కార్తీక మాస చివరి రోజైన అమావాస్య అపురూప సన్నివేశ నేపథ్యంలో దేవస్థాన ఆస్థాన వేదపండితులు బొజ్జా రమేశ శర్మ రూపశిల్పిగా, వినూత్నంగా క్షేత్రంలో ఏర్పాటు చేసిన, అరుదైన, అపురూప ఆ సన్నివేశ సందర్భంగా గురు వారం సాయంత్రం 4 గంటల నుండి శ్రమించి ఏర్పాటు చేసిన వేలాది దీపాలంకరణలకు అనూహ్య స్పందన లభించింది. వేద పండితులు, అర్చకులు, సిబ్బంది నిర్వహించగా, మహిళలు, దీపాల అలంకరణకు సహకరించారు. అమావాస్య రాత్రి మునుముందుగా గోధూళి ముహూర్తాన దేవస్థానం ఇఓ శ్రీనివాస్, జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల దర్శకత్వంలో, హారతి భక్తులు దేవస్థానం వద్దనుండి మంగళ వాద్యాలు తోడు రాగా కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజాదులలో పాల్గొని నదీమ తల్లికి సంప్రదాయ రీతిలో మహా హారతి సమర్పించారు. మునుముందుగా గోధూళి ముహూర్తాన దేవస్థానం ఇఓ శ్రీనివాస్ జక్కు రవీందర్ నేతృత్వం లోని ధర్మ కర్తల దర్శకత్వంలో, ఆస్థాన వేద పండితులు బొజ్జా రమేశ శర్మ,



అర్చకులు నేరేళ్ళ శ్రీనివాసాచార్య, ప్రవీణ్, రాజగోపాల్, అరుణ్,సంతోష్, సూపరింటెంట్ కిరణ్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్, సి ఐ రాం నర్సింహా రెడ్డి దంపతులు, దేవస్థానం వివిధ ఆలయాల అర్చకులు, మహిళలు, సువాసినులు, శ్రీ శారదా మహిళా మండలి, శ్రీవల్లి స్వచ్ఛంద సంస్థ సభ్యులు,సిబ్బంది ప్రత్యేక పూజలాచరించి మంగళ హారతి, మంత్ర పుష్ప నీరాజనాది క్రతువులు నిర్వహించిన అనంతర సనాతన సాంప్రదాయ రీతిలో నది నీటిలో కార్తీక దీపాలను దొప్పలలో వెలిగించి వదిలి పెట్టారు.

**ముగిసిన కార్తీక మాసోత్సవాలు**

పుణ్య తీర్థము, ప్రాచీన క్షేత్రమైన ధర్మపురిలో కార్తీక మాసోత్సవ వేడుకలు ఘనంగా ముగిసాయి. చివరి రోజైన గురు వారం గోదావరిలో కార్తీక మాస ముగింపు సందర్భంగా అత్యధిక సంఖ్యాకులైన భక్తులు, యాత్రికులు పవిత్ర నదీ స్నానాలకై తరలి వచ్చారు. ప్రధానంగా కార్తీక మాస చివరి రోజు, అమావాస్య నాడు సుదూర ప్రాంతాల నుండి ఆర్టీసీ బస్సులు మరియు ప్రైవేటు వాహనాలలో భక్తులు అరుదెంచారు. కార్తీక మాసంలో నదీ స్నానమాచరిస్తే నరక బాధలుండవనే విశ్వాసంతో నెల రోజుల ఉదయాత్పూర్వ స్నానాలకు ముగింపు పలికేందుకు, చివరి రోజు ఉదయాత్పూర్వం నుండే పిల్లా పాపలతో, గోదావరి నదిలో మంగళ స్నానాలు ఆచరించి, దీపా రాధనగావించి,దొప్పలలో దీపాలను వెలిగించి,నదినీటిలో వదిలి పెట్టారు. నదీమ తల్లికి మొక్కులు చెల్లించు కున్నారు. శివాలయంలో రావిచెట్టుకు పూజలు చేశారు. ప్రధానాలయాలలో ఈ సందర్భంగా ఉదయం పంచోపనిష యుక్త అభిషేకాలు,ప్రత్యేక అర్చనలు, పూజలు, నిత్య కళ్యాణ అది కార్య క్రమాలు,నిత్య కళ్యాణ దాతల పేరున అర్చనలు, షోడశోపచార విధివిధాన పూజలు నిర్వహించగా,భక్త జనం ప్రత్యేక పూజులలో పాల్గొన్నారు. దేవస్థానం ఎసి, ఇఓ శ్రీనివాస్,జక్కు రవీందర్ నేతృత్వంలోని ధర్మ కర్తలు,ఆస్థాన వేద పండితులు,రమేశ శర్మ,అర్చక పౌరోహితులు ప్రవీణ్ శర్మ,సంతోష్ శర్మ,సంపత్ కుమారశర్మ,రాజగోపాల్ శర్మల సహకారంతో ఆలయాల అర్చకులు వేదోక్త సాంప్రదాయ రీతిలో పూజలను నిర్వహించారు. వేద పండితులు,అర్చకులు,నాయకులు, పాల్గొన్నారు.



## జాతీయ కార్యదర్శికి సన్మానం



**చురకలు విలేకరి, ఇబ్రహీంపట్నం, నవంబర్ 20 :** జగిత్యాల జిల్లా కేంద్రంలోని ఇందిరాభవన్లో గురువారం నిర్వహించిన జిల్లా యూత్ కాంగ్రెస్ సమావేశానికి జాతీయ యూత్ కాంగ్రెస్ కార్యదర్శి రోసిని జైశ్వాల్ హాజరు కాగా ఇబ్రహీంపట్నం మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు నల్లూరి సాగర్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు ఆమెను శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు భీరం రాజేష్,నియోజకవర్గ కాంగ్రెస్ అధ్యక్షుడు పెంట ప్రణయ్, యూత్ కాంగ్రెస్ మీడియా కోఆర్డినేటర్ కనుక దినేష్,యూత్ కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైభవంగా గోదావరి హారతి



**చురకలు విలేకరి,ధర్మపురి,నవంబర్ 20 :** ప్రముఖ పుణ్యక్షేత్రమైన ధర్మపురి శ్రీలక్ష్మి నర్సింహస్వామి ఆలయంలో కార్తీకమాసం అమావాస్య సందర్భంగా గురువారం గోదావరి హారతిని వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా శారద మహిళా మండలి,వాసవి మహిళా మండలి సభ్యులు,తిరుమల సేవా గ్రూప్ కరీంనగర్ సభ్యులు,శ్రీవల్లి సేవ గ్రూప్ పెద్ద సభ్యులు,దేవస్థాన అర్చకులు లక్ష్మి నర్సింహస్వామి ఆలయం నుండి మేళతాళాలతో గోదావరి నది వరకు వెళ్లి ప్రత్యేక పూజలు నిర్వహించి దీపాలను వెలిగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీనివాస్,ఆలయ చైర్మన్ జక్కు రవీందర్,కమిటి సభ్యులు, వేదపండితులు బోజ్జ రమేష్ శర్మ,సూపరిండెంట్ కిరణ్,సీనియర్ అసిస్టెంట్ అల్వాల శ్రీనివాస్,ఉప ప్రధాన అర్చకులు నంబి శ్రీనివాసాచారి,సీఐ రాంనర్సింహారెడ్డి,అభిషేకం పురోహితులు బోజ్జ సంతోష్ కుమార్,రాజగోపాల్, అర్చకులు,సిబ్బంది పాల్గొన్నారు.

## మాజీ వీఏఓపై కాంగ్రెస్ నాయకుడి దురహంకారం




**చురకలు విలేకరి,మల్లాపూర్, నవంబర్ 20 :** మాజీ వీఏఓ సరితపై కాంగ్రెస్ నాయకుడి దురహంకారం చూపడం సరికాదని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, జిల్లా మాజీ జెడ్పీ చైర్పర్సన్ దావ వసంతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం మండలంలోని రేగుంట గ్రామంలో మాజీ వీఏఓ సరిత చేస్తున్న ఒంటరీ దీక్షకు వారు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామానికి చెందిన కాంగ్రెస్ పార్టీ నాయకుడు బలహీన వర్గాల మహిళను వేదింపులకు గురి విధుల నుంచి తొలగించి మళ్లీ ఆర్డర్ కాపీ ఇచ్చి విదుల్లోకి తీసుకోకపోవడంపై పదిరోజులుగా నిరాహారదీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం దుర్మార్గమైన చర్య అన్నారు. వెంటనే ప్రభుత్వం స్పందించి విధుల్లోకి తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కర్యాక్రమంలో బీఆర్ఎస్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# తెలంగాణలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలి

**-మిషన్ పరివర్తనలో భాగంగా నషాముక్త భారత్ అభియాన్**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 :** ఎల్లారెడ్డిపేట మండలంలోని జెడ్పిహెచ్ఎస్. రాచర్ల గొల్లపల్లిలో తెలంగాణలో డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలనే సంకల్పంతో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో చేపట్టిన మిషన్ పరివర్తన లో భాగంగా నషాముక్త భారత్ అభియాన్ కార్యక్రమము నిర్వహించారు. ఇందులో ఇంపాక్ట్ ఫౌండేషన్ మోటివేటర్ శ్రీ జనార్దన్ గారు మాట్లాడుతూ మాదక ద్రవ్యాలను వాడడం వల్ల కలిగే అనర్ధాలను వివరిస్తూ, తెలంగాణ రాష్ట్రంలో తలపెట్టిన డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించాలని ప్రతి ఒక్కరు మాదక ద్రవ్యాలను వాడకూడదని , ఎవరైనా వాడితే టోల్ ఫ్రీ నెంబర్ 1908 కి కాల్ చేసి డ్రగ్స్ రహిత సమాజాన్ని నిర్మించడంలో ప్రతి ఒక్కరు బాధ్యత వహించాలని చెప్పారు. రాజన్న సిరిసిల్ల జిల్లా చైల్డ్ ప్రొటెక్షన్ సెల్ నుండి శ్రీమతి దేవిక మేడం గారు మాట్లాడుతూ బాలల హక్కుల పరిరక్షణ, చైల్డ్ లేబర్ ను నివారించడం, బాల్యవివాహాలని అడ్డుకునే విధానం, ఫోన్ వాడడం వల్ల కలిగే అనర్ధాల గురించి వివరించారు. భార్గవి గారు పోక్సో చట్టం గురించి వివరించారు. విద్యార్థులచే మాదక ద్రవ్యాల నివారణ ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు పి. మురళీధర్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# దుమాలలో అంతర్జాతీయ బాలల హక్కుల దినోత్సవం



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 20 :** అంగన్‌వాడీ ఉపాధ్యాయులు లబ్ధిదారులకు,సమాజం అందరికీ బాలల హక్కులను గురించి వాటి ఆవశ్యకత గురించి వివరించారు. బాలలకు అభివృద్ధి చెందే హక్కు ఉంది. వారికి మంచి పోషకాహారం అందించడం,సురక్షితమైన తాగునీరు అందించడం,మంచి పరిసరాలను ఏర్పాటు చేయడం మన బాధ్యత.బాలలకు ఇమ్యునైజేషన్ చేయించడం,వ్యాధులు నిరోధక టీకాలు ఇప్పించడం,ఆరోగ్యాన్ని సంరక్షించడం,అవసరమైన మందులు అందించడం,దుస్తులు అందించడం వారికి అవసరం ఉన్న అన్ని వస్తువులను అందించడం మన యొక్క బాధ్యత.. బాలలకు అన్ని విషయాలను వివరించి చెప్పడం,వారికి సంబంధించిన నిర్ణయాలలో వారి అనుమతి తీసుకోవడం భాగస్వామ్యకు హక్కు కింద వస్తుంది. ఐదు సంవత్స రాలు దాటిన పిల్లలకు ఏదైనా విషయం నిర్ణయం తీసుకుంటున్నప్పుడు వివరించి వారి అనుమతి తీసుకోవాలి అని అంతర్జాతీయ సూత్రాలు చెబుతున్నాయి. పిల్లలను లైంగిక వేధింపుల నుండి శారీరక వేధింపుల నుండి మానసిక వేధింపుల నుండి రక్షించడం మనందరి బాధ్యత... నేటి పిల్లలే రేపటి పౌరులు వారి మానసిక వికాసం సరిగ్గా జరగాలంటే ప్రేమ, వాత్సల్యం, అనురాగం, కరుణ, ఆప్యాయతలతో వారిని పెంచి పెద్ద చేసి భారతీయ సాంప్రదాయ కుటుంబ విలువలను వారికి నేర్పించి మన సమాజాన్ని మనం కాపాడుదాం. గురువారం మనం చేస్తున్న ఈ చిన్ని కార్యక్రమం తరతరాలుగా వస్తున్న మన భారతీయ సాంప్రదాయాలకు ప్రత్యేక. కాబట్టి మనందరం మన పిల్లల్ని జాగ్రత్తగా పెంచి వారికి కావలసిన అభివృద్ధికి అవసరమైన అన్ని వనరులు సమకూర్చి వారి భాగస్వామ్యంతో వారిని రక్షించి వారి ఎదుగుదలకు మనందరం కృషి చేద్దాం అని చెప్పి అంతర్జాతీయ బాలల దినోత్సవం సందర్భంగా బాలలకు 1.జీవించే హక్కు,2.రక్షణ పొందే హక్కు 3.భాగస్వామ్యం పొందే హక్కు ,4.అభివృద్ధి చెందేహక్కులు అని స్థూలంగా నాలుగు రకాలుగా విభజించవచ్చును..అని వివరించారు.

# నేటి నుంచి అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవాలు

**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** కరీంనగర్ జిల్లా తిమ్మాపూర్ మండలం మహాత్మానగర్ లో (ఎల్ఎండి) నూతనంగా నిర్మించిన శ్రీ అయ్యప్ప స్వామి దేవాలయ ప్రతిష్ట మహోత్సవ వేడుకలు శుక్రవారం నుండి ప్రారంభమవుతాయని దేవాలయ కమిటీ నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలియజేశారు.నవంబర్ 21,22,23వ తేదీల్లో దేవాలయ ప్రతిష్టా మహోత్సవ వేడుకలు,పూజ కార్యక్రమాలు జరుగుతాయని పేర్కొన్నారు.దేవాలయ స్థాపనలో భాగంగా శ్రీ శ్రీ హరి హర పుత్ర ధర్మ శాస్తా (అయ్యప్పస్వామి), గణపతి, సుబ్రహ్మణ్య, నాగేంద్ర, పార్వతీదేవి, నవగ్రహ దేవత విగ్రహాల ప్రతిష్ట లతోపాటు శిఖరధ్వజ,మహా కుంభాభిషేక మహోత్సవ కార్యక్రమాలు ఘనంగా నిర్వహించడానికి తగిన ఏర్పాటు చేసినట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.శ్రీ శ్రీ శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య పీఠాధిపతులు శ్రీ శ్రీ విద్యారణ్య భారతి స్వామి కరకమలములతో యంత్ర ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ట, మహా కుంభాభిషేక కార్యక్రమాలు జరుగుతాయని వివరించారు.




ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకలకు హాజరయ్యే సమస్త భక్తులు, అయ్యప్ప స్వాములకు ఏలాంటి అసౌకర్యం,ఇబ్బందులు తలెత్తకుండా అన్ని రకాల చర్యలు, జాగ్రత్తలు చేపట్టినట్లు దేవాలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.ప్రతిరోజు అన్నప్రసాద వితరణ ఉంటుందని చెప్పారు.హిందూ బంధువులు,అయ్యప్ప భక్తులు ప్రతి ఒక్కరూ ఇట్టి దేవాలయ ప్రతిష్ఠాపన మహోత్సవ వేడుకల్లో పాల్గొని,శ్రీఅయ్యప్ప స్వామి కృపకు పాత్రులు కాగలరని ఆలయ నిర్వాహకులు కోరారు.

# టీజీఎమ్మార్ఈఐఎస్ బాలుర వన్ విద్యార్థులకు బహుమతి ప్రధానోత్సవం



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** కరీంనగర్ రూరల్ మండలం బొమ్మకల్ గ్రామంలో ఉన్న విట్స్ కళాశాల భవన సముదాయంలో కొనసాగుతున్న తెలంగాణ మైనార్టీ గురుకుల పాఠశాల మరియు కళాశాల బాలురు 1, విద్యార్థులు 58వ జాతీయ గ్రంథాలయ వారోత్సవంలో కరీంనగర్ జిల్లా శాఖ వారు నిర్వహించిన చిత్రలేఖనం మరియు జానపద గేయాల పోటీల్లో ఎం.యశ్వంత్ సాయి చిత్రలేఖనంలో జి అనిరుద్,ఆర్ జశ్వంత్ జానపద గేయాల పోటీల్లో అత్యంత ప్రతిభ కనబరిచి బహుమతులను గెలుపొందారు ఈరోజు జరిగిన ముగింపు సమావేశంలో గ్రంధాలయ చైర్మన్ సత్తు మల్లయ్య చేతులమీదుగా బహుమతులను అందుకోవడం జరిగింది.ఈ బహుమతులు గెలుపొందినటువంటి విద్యార్థులను పాఠశాల ప్రిన్సిపాల్ వి మహేష్, పాఠశాల ఉపాధ్యాయ బృందం డిప్యూటీ వార్డెన్ అభినందించి శుభాకాంక్షలు తెలియజేశారు.

# రోడ్డుపై వడ్ల కుప్పలు... ప్రమాదపు అంచున వాహనాలు..



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 :** రోడ్లపై వడ్ల కుప్పలు పోయొద్దని దీనివల్ల ప్రమాదాలు జరుగుతున్నాయని పోలీసులు హెచ్చరికలు చేస్తున్నప్పటికీ రైతులు ఏ మాత్రం పట్టించుకోవడం లేదు.ఎల్లారెడ్డిపేట మండలం దుమాల గ్రామం నుండి రాగట్లపల్లె వెళ్లే దారిలో వడ్లకుప్పలను దారి వెంబటి కుప్పలుగా గా పోసి ఉంచారు.దీంతో అటుగా గూడ్స్ వ్యాన్ లోడుతో వెళ్తుండగా గురువారం వడ్ల కుప్పను తప్పించబోయి వ్యాన్‌ను రోడ్డు దించడంతో వ్యాన్ ఒక్కసారిగా పక్కకు ఒరిగి టైర్లు దిగబడ్డాయి..వెంటనే డ్రైవర్ అతి చాకచక్యంగా వ్యవహరించి వ్యానును నిలుపుదల చేసి జెసిబిని అక్కడికి తెప్పించి దాని సహాయంతో వాహనాన్ని బయటకు తీపించారు.ఈ సందర్భంగా గూడ్స్ వాహన యజమానులు,డ్రైవర్లు మాట్లాడుతూ రోడ్లపై వడ్ల కుప్పలను ఏర్పాటు చేయడం ద్వారా వాహనాలకు తరచుగా ప్రమాదాలు పలు యాక్సిడెంట్లు జరుగుతున్నాయని అన్నారు.అదేవిధంగా మొన్న ఓ ట్రక్కు కూడా బోల్తా పడ్డదని గుర్తు చేశారు .వడ్లకుప్పలు పోస్తున్న రైతులను పోలీసులు కట్టడి చేయాలని వారు కోరారు.

# ఆలయ పునః నిర్మాణం కోసం నిధులు ఇప్పించండి

**-రాష్ట్ర దేవదాయ శాఖ మంత్రి కొండ సురేఖను కలిసిన సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి**



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డిపేట నవంబర్ 20 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ పట్టణ కేంద్రంలోని దాదాపు 700 సంవత్సరాలపైగా చరిత్ర గల అతి పురాతన శ్రీబివేణుగోపాలబిస్వామి ఆలయ పునః నిర్మాణ నిధుల కోసం రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రివర్యులు కొండ సురేఖను సిరిసిల్ల శాసనసభ నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి కేకే మహేందర్ రెడ్డి గురువారం కలిశారు. అందుకు కొండ సురేఖ సుముఖత వ్యక్తం చేసినట్లు కేకే మహేందర్ రెడ్డి తెలిపారు.

# సమూహా యువ సాహితోత్సవం పోస్టర్ ఆవిష్కరణ



**చురకలు విలేఖరి వీణవంక నవంబర్ 20 :** ఈనెల 22 తేదీన వీరనారి చాకలి ఐలమ్మ మహిళా విశ్వవిద్యాలయం,కోటి,హైదరాబాదులో జరిగే సమూహ యువ సాహితోత్సవం పోస్టర్ వీణవంక ఎస్సై ఆవుల తిరుపతి ఆవిష్కరించారు. ఎస్ఐ మాట్లాడాలి. మండలంలోని యువ రచయితలు,కవులు కళాకారులు అందరు ఈ సాహిత్యోత్సవంలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.ఈ కార్యక్రమంలో కవి,గాయకులు గోనెల సమ్మన్న,దరిపెల్లి మురళి, గంగాడి రాజిరెడ్డి, మల్లేష్,రాయణవేణి వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

# పోలీసులపై పెరిగిన భరోసా.. 'డయల్ 100' అద్భుత విజయం

**-ఆపదలో మేమున్నామంటూ ఒక్క కాల్‌తో ముందుకొస్తున్న కరీంనగర్ పోలీసులు**

**-కరీంనగర్ కమీషనరేటులో విజయవంతంగా అమలవుతున్న "నేర నివారణాత్మక పోలీసింగ్" (ప్రివేంటివ్ పోలీసింగ్) విధానం**

**-10 నెలల్లో 43 వేల మందికి తక్షణ సాయం**

**-నేరాల నియంత్రణలో 'బ్లూ కోల్ట్స్, పెట్రోలింగ్' భేష్**

**- కరీంనగర్ పోలీస్ కమీషనర్ - గౌష్ ఆలం**



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** "ఆపదొస్తే 100కి కాల్ చేయండి.. పోలీసులు క్షణాల్లో మీ ముందుంటారు.." అనే నినాదం కరీంనగర్ కమీషనరేటులో వందశాతం అమలవుతోంది. ప్రజలకు పోలీసు వ్యవస్థపై నమ్మకం రెట్టింపయ్యింది. ఏ చిన్న సమస్య వచ్చినా, అర్ధరాత్రి ఆపద వచ్చినా 'డయల్ 100' ఆపద్బాంధవుడి లా మారుతోంది.జిల్లా పోలీస్ శాఖ నిరంతర పర్యవేక్షణ,బ్లూ కోల్ట్స్ సిబ్బంది అంకితభావం వెరసి.. గడిచిన 10 నెలల్లో (జనవరి 1, 2025 నుండి అక్టోబర్ 31, 2025 వరకు) ఏకంగా 43,105 మంది బాధితులకు పోలీసులు అండగా నిలిచారు. ఇది కేవలం సంఖ్య మాత్రమే కాదు..43 వేల సార్లు పోలీసులు ప్రజల చెంతకు చేరి వారికి భరోసా కల్పించిన వైనం.

**సమస్య చిన్నదైనా.. స్పందన వేగవంతం:**

గతంలో పోలీస్ స్టేషన్‌కు వెళ్లాలంటేనే భయపడే పరిస్థితుల నుండి, నేడు ఫోన్ చేస్తే చాలు పోలీసులు ఇంటి ముందే వాలతున్నారంటే 'డయల్ 100' ఎంత విజయవంతమైందో అర్థం చేసుకోవచ్చు.మొత్తం కాల్స్‌లో అత్యధికంగా 22,830 కాల్స్ చిన్న చిన్న తగాదాలు,న్యూసెన్స్ (Others/Nuisance) వంటి వాటికి సంబంధించినవే ఉన్నాయి. దీన్ని బట్టి గొడవ పెద్దది కాకముందే పోలీసులు జోక్యం చేసుకుని,కౌన్సిలింగ్ ఇచ్చి శాంతిభద్రతలను కాపాడుతున్నారని స్పష్టమవుతోంది.

**మహిళల్లో వెల్లువెత్తిన ధైర్యం:**

మహిళా భద్రత విషయంలో జిల్లా పోలీసులు తీసుకుంటున్న చర్యలు సత్ఫలితాలనిస్తున్నాయి.ఒకప్పుడు వేధింపులను మౌనంగా భరించే మహిళలు, ఇప్పుడు ధైర్యంగా డయల్ 100ని ఆశ్రయిస్తున్నారు.గత పది నెలల్లో 5,641 మంది మహిళలు తమ సమస్యలను పోలీసుల దృష్టికి తెచ్చారు. దీనివల్ల ఎంతోమంది మహిళలకు తక్షణ రక్షణ లభించడమే కాకుండా, నేరస్థులకు పోలీసులు గట్టి హెచ్చరికలు జారీ చేయగలిగారు.ఈ చైతన్యం మహిళా సాధికారతకు నిదర్శనం.

**పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో విస్తృత సేవలు:**

అర్బన్ ప్రాంతాల్లోనే కాకుండా గ్రామీణ ప్రాంతాల్లోనూ డయల్ 100 సేవలు విస్తృతం అయ్యాయి. అత్యధిక జనసాంద్రత కలిగిన కరీంనగర్ టూ టౌన్ (5,176 కాల్స్), కరీంనగర్ వన్ టౌన్ (5,006 కాల్స్) పరిధిలో పోలీసులు రికార్డు స్థాయిలో సేవలు అందించారు. కరీంనగర్ నగర శివార్ల పరిధిగాగల కొత్తపల్లి (3,803), కరీంనగర్ రూరల్ (3,486) స్టేషన్ల పరిధిలోనూ ప్రజలు పోలీసు సేవలను విస్తృతంగా వినియోగించుకుంటున్నారు.

**ప్రాణదాతలుగా పోలీసులు:**

కేవలం నేరాలే కాదు, రోడ్డు ప్రమాదాలు జరిగినప్పుడు కూడా ప్రజలు అంబులెన్స్ కంటే ముందు 100కే కాల్ చేస్తున్నారు. ఇలా 2,288 రోడ్డు ప్రమాద ఘటనల్లో పోలీసులు క్షతగాత్రులను ఆసుపత్రులకు తరలించి ఎంతోమంది ప్రాణాలను కాపాడారు. అలాగే 561 ఆత్మహత్యాయత్న ఘటనల్లో సమయానికి స్పందించి నిండు ప్రాణాలను నిలబెట్టారు. మొత్తంగా చూస్తే.. కరీంనగర్ జిల్లాలో 'డయల్ 100' అనేది కేవలం ఒక నంబర్ కాదు, అది ప్రజల రక్షణ కవచం అని ఈ గణాంకాలు ఘంటాపథంగా చెబుతున్నాయి.

**కొన్ని ఉదాహరణలు**

1.కొత్తపల్లి మండలం బావుపేటలో కుటుంబ గొడవలతో వాటర్ ట్యాంక్ ఎక్కి ఆత్మహత్యకు యత్నించిన సన్నీ (దయాసాగర్)అనే యువకుడిని కానిస్టేబుల్ విజయరావు రక్షించారు. గత జూన్ నెలలో 01వ తేదీన ఆదివారం డయల్ 100 సమాచారం అందగానే ఘటనా స్థలానికి చేరుకున్న కానిస్టేబుల్,యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చి,కుటుంబ సభ్యులతో మాట్లాడి సమస్యను పరిష్కరించి అతన్ని సురక్షితంగా కిందకు దించారు. సమయస్ఫూర్తితో వ్యవహరించి ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ విజయరావును అప్పటి ఎస్సై సాంబ మూర్తి అభినందించారు. 2. కుటుంబ సమస్యలతో శనివారం అర్ధరాత్రి ఎల్ఎండీ డ్యామ్ వద్ద ఆత్మహత్యకు యత్నించిన వేల్పుల సంపత్ (39) అనే వ్యక్తిని బ్లూ కోల్ట్స్ హొంగార్డు మామిడిపల్లి శ్రీనివాస్ సమయస్ఫూర్తితో కాపాడారు.బాధితుడి కి కౌన్సెలింగ్ ఇచ్చి సురక్షితంగా కుటుంబ సభ్యులకు అప్పగించారు.ప్రాణాలు కాపాడిన కానిస్టేబుల్ శ్రీనివాస్‌ను సీపీ గౌష్ ఆలం అభినందించారు.

**ప్రజల నమ్మకానికి నిదర్శనం - ఈ అంకెలే సాక్ష్యం!**

(01.01.2025 నుండి 31.10.2025 వరకు)

మొత్తం అందిన పిలుపులు : 43,105

చిన్న సమస్యలు & న్యూసెన్స్ పరిష్కారం (Others): 22,830

వ్యక్తిగత తగాదాల నివారణ : 8,754

మహిళలకు రక్షణగా : 5,641

ఆస్తి రక్షణలో : 3,031

క్షతగాత్రులకు సాయం : 2,288

ప్రాణాలను కాపాడినవి (Suicide Attempts): 561,

కమీషనరేట్ వ్యాప్తంగా ఈ పదినెలల్లో డయల్ 100 ద్వారా

అత్యధిక సేవలు అందించిన మొదటి మూడు పోలీసు స్టేషన్లు వరుసగా:

కరీంనగర్ టూ టౌన్ (5,176)

కరీంనగర్ వన్ టౌన్ (5,006)

కొత్తపల్లి (3,803)

**పోలీసు కమీషనర్ గౌష్ ఆలం వివరణ - విజ్ఞప్తి:**

న్యూసెన్స్ కాల్స్ ఎక్కువగా రావడం ఆందోళనకరం, "డయల్-100" సేవలు ప్రజల అత్యవసర సమస్యలను పరిష్కరించేందుకు అత్యంత కీలకమైనది. అయితే, మొత్తం 43,105 కాల్స్‌లో, 22,830 కాల్స్ న్యూసెన్స్, పునరావృత కాల్స్‌గా నమోదవడం పోలీసు విభాగానికి భారంగా మారుతోంది. ఈ కాల్స్ వల్ల నిజమైన అత్యవసర ఫిర్యాదులపై స్పందనలో ఆలస్యం ఏర్పడే అవకాశం ఉన్నదాని సీపీ తెలిపారు. "డయల్-100" సేవలను అవసరం ఉన్నప్పుడు మాత్రమే వినియోగించండి. అవాస్తవ లేదా అప్రయోజక కాల్స్ చేయవద్దు" అని సీపీ గౌష్ ఆలం ప్రజలకు విజ్ఞప్తి చేసారు.



# ప్రమాదాల నివారణకు ఎల్ఎండీ పోలీసుల వినూత్న ప్రయోగం

**-రాజీవ్ రహదారిపై 'ట్రాఫిక్ పోలీస్ బొమ్మల' ఏర్పాటు**

**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :**

రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు మరియు వాహన దారులను అప్రమత్తం చేసేందుకు కరీంనగర్ ఎల్ఎండీ (LMD) పోలీసులు సరికొత్త ఆలోచనతో ముందుకొచ్చారు. కరీంనగర్ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు, తిమ్మాపూర్ మండలంలోని రాజీవ్ రహదారిపై ప్రమాదకరమైన మలుపులు, జంక్షన్ల వద్ద ట్రాఫిక్ పోలీసులను పోలి ఉండే 'ట్రాఫిక్ పోలీస్ బొమ్మలను' (Mannequins) ఏర్పాటు చేశారు. అతివేగానికి కళ్లెం వేయడం మరియు వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించేలా చూడటం,నుస్తులాపూర్ నుండి కరీంనగర్ వరకు ఉన్న ప్రధానమైన యూ-టర్న్‌లు (U-Turns) మరియు ట్రాఫిక్ జంక్షన్ల వద్ద వీటిని ఏర్పాటు చేస్తున్నారు. అవసరమైన చోట్ల 30 స్టాపర్లతో పాటు, ప్రయోగాత్మకంగా మొత్తం 6 ట్రాఫిక్ పోలీస్ బొమ్మలను ఏర్పాటు చేశారు.దూరం నుండి చూస్తే సాక్షాత్తు ట్రాఫిక్ పోలీసులే విధుల్లో ఉన్నట్లుగా కనిపించడంతో వాహన దారులు అప్రమత్తమై, వేగాన్ని తగ్గించి జాగ్రత్తగా వెళ్తారని పోలీసులు భావిస్తున్నారు.ప్రమాదాల నివారణ కోసమే శాఖాపరంగా ఈ చర్యలు చేపట్టామని, వాహనదారులు తప్పనిసరిగా ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలని పోలీసులు కోరారు.




## జి.ఎం సి.హెచ్.పి పర్యటన



**చురకలు ప్రతినిధి కమాన్ పూర్ నవంబర్ 20 :** సింగరేణి సంస్థ కార్పోరేట్ సిహెచ్‌పిలవిభాగంజనరల్ మేనేజర్ ఎస్.వి.రామమూర్తి గురువారం రామగుండం-3 ఏరియాలో పర్యటించారు.నూతనంగా కార్పోరేట్ సిహెచ్పిల విభాగం జనరల్ మేనేజర్ గా పదవీ బాధ్యతలు స్వీకరించిన తరువాత మొదటి సారిగా ఏరియాలో పర్యటించిన సందర్భంగా జి.యం.కార్యాలయం నందు రామగుండం-3 ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకరరావు వారిని శాలువాతో సత్కరించి,మొక్కను అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు.అనంతరం వారు ఏరియాలోని సిహెచ్పిని సందర్శించి, పరిశీలించారు.కార్యక్రమంలో ఏరియా ఇంజినీర్ వై.వి.శేఖర్ బాబు, సిహెచ్పి డిజియం కాశీ విశ్వేశ్వర రావు,ఇతర అధికారులు ఉన్నారు.

## సిఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ చేసిన సుడా చైర్మన్



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** వివిధ అనారోగ్య కారణాలతో ఆసుపత్రులలో చికిత్స పొంది అర్హత గల వారిని ముఖ్యమంత్రి సహాయనిధి ద్వారా ఆదుకుంటున్నామని సుడా చైర్మన్ కోమటిరెడ్డి నరేందర్ రెడ్డి అన్నారు.నగర కాంగ్రెస్ కార్యాలయంలో 18 మందికి మొత్తం కలిపి 6 లక్షల 70 వేల రూపాయల చెక్కులు పంపిణీ చేశారు.ఈ సందర్భంగా నరేందర్ రెడ్డి మాట్లాడుతూ కరీంనగర్ నియోజకవర్గంలో ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి ఇప్పటి వరకు 846 మందిని నగర కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన హెల్ప్ డెస్క్ ద్వారా ఆదుకున్నామని కాంగ్రెస్ ప్రభుత్వంలో అన్ని వర్గాల ప్రజలు సంతోషంగా ఉండాలన్నదే మా కోరిక అని నరేందర్ రెడ్డి పేర్కొన్నారు.లబ్ది దారులు జుట్టు లక్ష్మీనారాయణ,దారం స్రవంతి,దర్యపల్లి వాణి,పురుమల్ల శ్రీలత,ముజీబున్నీసా బేగం, యాసమీన్ ఫాదౌస్,గుర్రం సురేష్, యెన్నం మహిపాల్,సైద్ సుమర్,మహంకాళి ప్రసాద్,అహ్మద్ అలీ,భూలక్ష్మి,రాజేంద్ర ప్రసాద్, మాచర్ల శేఖర్,సుతారి మల్లేశం, సయ్యద్ మస్తాన్,గుంటి మల్లయ్య,కిష్టయ్య లకు చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు.

## 2 లక్షల 50 వేల ఎల్ఓసి అందజేత



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 20 :** కమాన్ పూర్ మండలం దూలపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రశాంతికి రెండు లక్షల 50 వేల రాష్ట్ర ఐటీ పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ళ శ్రీధర్ బాబు ఇప్పించి పేద ప్రజలకు అండగా నిలుస్తున్నారు.అనారోగ్య బాధితులకు మంత్రి శ్రీధర్ బాబు భరోసా కల్పిస్తున్నారు. మంథని నియోజకవర్గం కమాన్ పూర్ మండలంలోని జూలపల్లి గ్రామానికి చెందిన కొమ్ము ప్రశాంతి కి అనారోగ్య వైద్య చికిత్సకు సంబంధించిన ( 2,50,000 ఎల్ ఓ సి) హైదరాబాద్ లోని నిమ్స్ ఆసుపత్రి లో అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సహాయం కొరకు మంత్రి శ్రీ దుద్దిళ్ల శ్రీధర్ బాబు గారికి తెలుపగా వెంటనే సీఎంఆర్ఎఫ్ ద్వారా వైద్య ఖర్చుల నిమిత్తం వీరికి2 లక్షల50వేల ఎల్ వో సి మంజూరు చేయించి మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు ఆస్పత్రి సహాయకులు హైదరాబాద్ లోని క్యాంపు కార్యాలయంలో అందచేయడం జరిగింది.2లక్షల 50 వేలఎల్ఓసి మంజూరు చేపించి అండగా నిలిచినా మంత్రి శ్రీధర్ బాబు కి... వారి కుటుంబ సభ్యులు ధన్యవాదాలు తెలిపారు.

# స్థానిక సంస్థ ఎన్నికలు సమర్ధవంతంగా నిర్వహించాలి

### -రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని



**చురకలు ప్రతినిధి కరీంనగర్ నవంబర్ 20 :** రాష్ట్రంలో స్థానిక సంస్థల ఎన్నికలను సమర్ధవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ రాణి కుముదిని అన్నారు. గురువారం హైదరాబాద్ నుండి రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణా రావు, రాష్ట్ర డి.జి.పి. శివధర్ రెడ్డి, ఇతర ఎన్నికల సంఘం అధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల ఎన్నికల అధికారులు- కలెక్టర్లు, పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, పంచాయతీ అధికారులతో సర్పంచ్,వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ,ఓటరు జాబితా అభ్యంతరాలు, పోలింగ్ కేంద్రాలు, రిజర్వేషన్ల ప్రక్రియ, శాంతిభద్రతల అంశాలపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ఎన్నికల సంఘం కమిషనర్ మాట్లాడుతూ సర్పంచ్, వార్డు సభ్యుల ఎన్నికల నిర్వహణ ప్రశాంత వాతావరణంలో సమర్ధవంతంగా నిర్వహించాలని అన్నారు. ఎన్నికలను 3 విడతలలో నిర్వహించేందుకు అవసరమైన కార్యచరణ రూపొందించాలని తెలిపారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర, జిల్లా స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి సమర్ధవంతంగా అమలు చేయాలని, ఎన్నికల పరిశీలకులకు శిక్షణ అందించడం జరుగుతుందని అన్నారు. జిల్లా స్థాయిలో ఏర్పాటు చేసే ఎన్నికల నిర్వహణ కమిటీ సభ్యుల జాబితా సమర్పించాలని తెలిపారు. కరీంనగర్ కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్ నుండి జిల్లా కలెక్టర్ పమేలా సత్పతి, పోలీస్ కమిషనర్ గౌస్ ఆలం, అడిషనల్ కలెక్టర్ అశ్విని తానాజీ వాకడే, డిఆర్వో వెంకటేశ్వర్లు, జెడ్పి సీఈవో శ్రీనివాస్, జిల్లా పంచాయతీ అధికారి జగదీశ్వర్ వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొన్నారు.

# దీపం జ్ఞానానికి చిహ్నం...నిర్లక్ష్యమన్న చీకటిని పారదోలే దివ్యజ్యోతి

### -ఘనంగా దీపారాధన
### -ముఖ్య అతిథులుగా హంపి పీఠాధిపతి

**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 20 :** దీపం జ్ఞానానికి చిహ్నం. నిర్లక్ష్యమన్న చీకటిని పారదోలే దివ్యజ్యోతి అని హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారాణ్య భారతి స్వామి అన్నారు. కార్తీక మాసం చివరి రోజైన గురువారం ఎల్లారెడ్డిపేట మండలం రాచర్ల బొప్పాపూర్ గొల్లపల్లి గ్రామాల కు చెందిన జక్కుల చెరువులో హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో బ్రహ్మశ్రీ రఘురాం శర్మ,బ్రహ్మశ్రీ విశ్వనాథ్ శర్మ ఆధ్వర్యంలో దీపారాధన కార్యక్రమం నిర్వహించారు. హంపి పీఠాధిపతి శ్రీ శ్రీ శ్రీ విద్యారాణ్య భారతి స్వామి ప్రవచనం చేశారు. దీపం జ్యోతిః పరబ్రహ్మ దీపంజ్యోతిః నమో నమః దీపేన హరతేపాపం దీప దేవి నమో నమః దీపం పర బ్రహ్మ స్వరూపం. పరాయణత్వం కలిగిందై. పాప ప్రక్షాళన చేయునని బోధించారు మన ఇంట సిరులు ఇచేది దీపజ్యోతియే ! అట్టి దీపదేవికి. నమస్కారమన్నారు. దీపం జ్ఞానానికి చిహ్నం. నిర్లక్ష్యమన్న చీకటిని పారదోలే దివ్యజ్యోతి. ప్రతి ఇంట్లోనూ దేవుని ముందు ఉదయం, సాయం సంధ్యవేళ ఒకటి, రెండుసార్లు దీపారాధన చేయడం హిందూవుల ఆచారం. ఇళ్ళల్లో ఎప్పుడూ దీపం వెలుగుతూనే ఉంటుంది. దీనిని “అఖండ” దీపం అంటాము. అన్ని పవిత్ర సందర్భాలలోనూ జ్యోతి వెలిగించి ప్రారంభించే సంప్రదాయం మనకు ఉంది. దీప కాంతి చీకటిని పారదోలినట్లే, జ్ఞానం నిర్లక్ష్య ధోరణిని నిర్మూలిస్తుందంటున్నారు పెద్దలు. అందుకే అన్ని రూపాల్లోని సంపద అయిన గొప్ప జ్ఞానాన్ని సముపార్జించు కోవడం కోసం,అన్ని పవిత్ర సందర్భాల లోనూ మన ఆలోచనలకు, చర్యలకు సాక్ష్యంగా జ్యోతి వెలిగిస్తాము. సంప్రదాయబద్దంగా వెలిగించే నూనే దీపానికి ఆధ్యాత్మిక గుర్తింపు ఎక్కువుగా ఉంటుంది. దీపపు కుందిలో పోసే నెయ్యి లెదా నూనె, వత్తి మనలోని కోరికలు, అహంభావ ధోరణులకు సంకేతం. భగవంతుని ముందు దీపం వెలిగించగానే మనలోని కోరికలు నెమ్మదిగా ఆవిరవుతూ,అహం కాలిపోతూ వుంటుందని అర్థం చేసుకోవాలన్నారు. దీపారాధన కార్యక్రమంలో సుమారు 1500 మంది మహిళా భక్తులు పాల్గొని దీపాలను చెరువులో వదిలారు.



# ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన నిందితుడిని అరెస్ట్

### -కార్ సీజ్ , నిందితుడిని జ్యుడిషియల్ రిమాండ్‌కు తరలింపు
### -వివరాలు వెల్లడించిన సిరిసిల్ల రూరల్ సి.ఐ మొగిలి



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 20 :** రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రం నుండి సిరిసిల్ల వెళ్తున్న సిరిసిల్ల డిపోకు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఎవ్వలేదని డ్రైవర్‌పై దాడి చేసి కొట్టిన సిద్దిపేట జిల్లా.చిన్నకోడూరు మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల శ్రీకాంత్ అనే నిందితుడిని అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించినట్లు సిరిసిల్ల సీఐ మొగిలి తెలిపారు ఈసందర్భంగా సి.ఐ మొగిలి మాట్లాడుతూ...సిద్దిపేట జిల్లా చిన్నకోదూర్ మండలం గంగాపూర్ గ్రామానికి చెందిన పిట్ల శ్రీకాంత్ అనే వ్యక్తి కార్(TS 07 HJ 6969) కు తేదీ 19.11.2025 రోజున మధ్యాహ్నం సమయంలో ఇల్లంతకుంట నుండి సిరిసిల్ల వెళ్తున్న సిరిసిల్ల డిపో కు చెందిన ఆర్టీసీ డ్రైవర్ సైడ్ ఎవ్వలేదని కారును కొంత దూరం వెళ్లిన తర్వాత తిప్పుకొని వచ్చి ఆర్టీసీ బస్సుకు కారును అడ్డుగా నిలిపి బస్సు డ్రైవర్ బాలరాజును దుర్భాషలాడి బస్సు డ్రైవింగ్ క్యాబిన్లోకి వచ్చి డ్రైవర్ అయిన కల్లూరి బాలరాజును కొట్టి, బస్ అద్దాన్ని పగలగొట్టడానికి రాయితో విసరగా అద్దం పగిలి రోడ్డుకు పక్కన కూర్చున్న వల్లంపట్ల గ్రామానికి చెందిన సండి వజ్రవ్వ మోకాలిపై గాయం తగిలింది. ఘటనను ప్రశ్నించిన ఓబులాపూర్ గ్రామానికి చెందిన ప్రయాణికురాలు బత్తుల రాజవ్వతో కూడా నిందితుడు వాగ్వాదానికి దిగాడు. మొత్తం ఘటనను బస్సు కండక్టర్ తన మొబైల్ ఫోన్‌లో వీడియోగా రికార్డు చేయగా వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో నిందితుడు నిన్నటి నుండి పరారీలో ఉండగా,దాడికి గురైన డ్రైవర్ బాలరాజు ఫిర్యాదు మేరకు ఇల్లంతకుంట పోలీస్ స్టేషన్‌లో నిన్నటి రోజున కేసు నమోదు చేసి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు ఇల్లంతకుంట ఎస్.ఐ అశోక్ ఆధ్వర్యంలో మూడు టీమ్ లు ఏర్పాడి సాంకేతికత ఆధారంగా గురువారం సాయంత్రం రహీంఖాన్ పేట గ్రామ శివారులో నిందితున్ని పట్టుకొని తన మారుతి సుజుకి బలేనో కార్ సీజ్ చేసి నిందితున్ని అరెస్టు చేసి జ్యుడిషియల్ కస్టడీ గురించి రిమాండ్ కు తరలించడం జరిగిందని సి.ఐ మొగిలి తెలిపారు.

## పిఎసిఎస్ పాలక వర్గం పదవి కాలం పొడిగింపు



**చురకలు విలేకరి, మల్లాపూర్, నవంబర్ 20 :** సహకార సంఘాల చైర్మన్, పాలక వర్గ పదవీ కాలం పొడిగిస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు వచ్చే సంవత్సరం ఫిబ్రవరి వరకు పొడిగిస్తూ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో గురువారం మల్లాపూర్ మండలం సిరిపూర్ పాక్స్ చైర్మెన్ బద్దం అంజిరెడ్డి మరోసారి పదవి బాధ్యతల స్వీకరించారు. కాగా పలు కారణాలతో ఈ పాక్స్ పాలక వర్గంను ఈ ఏడాది ఆగస్టులో పొడిగింపును రద్దు చేస్తూ ఆ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పాక్స్ సభ్యులు హైకోర్టును ఆశ్రయించారు. విచారణ చేపట్టిన హై కోర్టు గడువును యధావిధిగా కొనసాగించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే. ఈ కార్యక్రమంలో వైస్ చైర్మన్ దులూరి సుధాకర్, డైరెక్టర్ పెంట శ్రీనివాస్, ఎనుగు ప్రవీణ్, కోట ధమ్మయ, పెంట రవి, ఇప్పలక్ష్మి, జక్కుల గంగరాజ, సంపాతి లక్ష్మీనారాయణ, లింగాల స్వామి,మసుల చిన్నయ్య, గుగ్లావత్ లక్ష్మణ్, మచ్చర్ల గాయత్రి సంఘ సబ్యులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులకు శుభాకాంక్షలు తెలిపిన కేటీఆర్,మాజి మంత్రులు



**చురకలు ప్రతినిధి ఎల్లారెడ్డి పేట నవంబర్ 20 :** మాజీమంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ నూతన వదువరులను ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలిపారు. ఎల్లారెడ్డిపేట మండల మాజీ జెడ్పిటిసి సభ్యులు చీటీ లక్ష్మణరావు స్వగృహానికి మాజీమంత్రి సిరిసిల్ల శాసనసభ్యులు కేటీఆర్ వెళ్ళి లక్ష్మణ్‌రావు కుమారుడు అఖిల్‌రావుకు ఇటీవల వివాహం జరగగా బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అఖిల్‌రావు మోనిక లక్ష్మీ నూతన దంపతులను ఆశీర్వదించి వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మంత్రి చామకూర మల్లారెడ్డి,ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్ రెడ్డి,మాజీ ఎమ్మెల్యే బాల్కసుమన్ స్థానిక బిఆర్ఎస్ పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## 42 శాతం రిజర్వేషన్ల ఖరారు తర్వాత ఎన్నికలు నిర్వహించాలి



**చురకలు ప్రతినిధి కమాన్‌పూర్ నవంబర్ 20 :** బీసీలకు42 శాతం రిజర్వేషన్లు ఖరారు అయిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని బీసీ సంక్షేమ సంఘం మంథని నియోజక వర్గ అధ్యక్షులు తోట రాజ్ కుమార్ ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో బీసీలకు 42% రిజర్వేషన్ కల్పిస్తామని గద్దెనెక్కిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. కామారెడ్డి డిక్లరేషన్ లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ ఇస్తామని చెప్పి ఓట్లు దండుకున్నారని పేర్కొన్నారు. రిజర్వేషన్లు ఖరారు చేయని పక్షంలో బీసీల ఆగ్రహానికి ప్రభుత్వం గురికాక తప్పదని హెచ్చరించారు. అలాగే బీసీలమంత కలిసి 42 శాతం రిజర్వేషన్లు సాధించేవరకు పోరాటం చేస్తామని అవసరమైతే ఢిల్లీ వేదికగా ప్రధానమంత్రి రాష్ట్రపతిని సైతం కలుస్తామని పేర్కొన్నారు. వీలైతే ఢిల్లీలోని జంతర్మంతర్ వద్ద అమర నిరాహార దీక్షలు చేపడుతామని పేర్కొన్నారు. రానున్న రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వానికి బీసీలే బుద్ధి చెప్తారని హెచ్చరించారు.

# నేషనల్ స్పోర్ట్స్‌లో చరిత్ర సృష్టించిన ఈఎంఆర్ఎస్ విద్యార్థులు

**-సన్మానించి అభినందించిన రాష్ట్ర మంత్రి అడ్లూరి**



**చురకలు, విలేఖరి, వెల్గటూర్, నవంబర్ 20 :** తెలంగాణ రాష్ట్ర ఏకలవ్య మోడల్ రెసిడెన్సియల్ స్కూల్ విద్యార్థులు నవంబర్ 11నుండి 15 వరకు రూర్కెలా, సుందర్గఢ్ లో జరిగిన 4 వ,నేషనల్ స్పోర్ట్స్ మీట్,2025లో విజయదుందు బి మోగించి 230 పతకాలతో రాష్ట్ర ప్రతిష్టను ప్రపంచానికి చాటి చెప్పిన ఈఎంఆర్ఎస్ విద్యార్థుల ను గురువారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగుల శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మన్ కుమార్ సచివాలయంలోనితన చాంబర్‌లో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ తెలంగాణ గిరిజన విద్యార్థి యువత ప్రతిభకు జాతీయ స్థాయిలో గుర్తింపు లభించిందని తెలిపారు. సీఎం రేవంత్ రెడ్డి అమలు చేస్తున్న నూతన క్రీడా విధానం ఈఎంఆర్ఎస్ నేషనల్ స్థాయి క్రీడల్లో గొప్ప పాత్రపోషిం చిందన్నారు. అథ్లెటిక్స్,షూటింగ్, బాక్సింగ్,జిమ్నస్టిక్, జూడో,యోగ స్విమ్మింగ్ క్రీడల్లో విద్యార్థులు సాధించిన పథకాలు క్రమశిక్షణ శ్రమ,పట్టుదలకుప్రతీకగా మంత్రి పేర్కొన్నారు.ఈఎంఆర్ఎస్ లో నైపుణ్యంగల శిక్షణను రాష్ట్రం అందిస్తుందనడానికి ఇది నిదర్శ నంఅన్నారు.విద్యార్థుల క్రీడల్లో విజయానికి కారణమైన కోచులు, టీచర్లు,అధికారులు,తల్లిదండ్రుల కృషి అభినందనీయమన్నారు.రాష్ట్రనికే గర్వకారణమైన ఈఎంఆర్ఎస్ క్రీడా కారులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.తెలంగాణ లోని 23 సంస్థల నుండి 580 మంది విద్యార్థులు,పాల్గొన్నారని,ఓవర్ ఆల్ ఛాంపియన్,ఓవర్ ఆల్ టీం ఛాంపియన్ , ఓవర్ ఆల్ ఇండివిజువల్ ఛాంపియన్ షిప్లను సొంతం చేసుకోవడం గర్వ కారణం అన్నారు.ఈక్రీడా విజయం అంతర్జాతీయక్రీడా పథకాల సాధన కు నాంది కావాలని మంత్రి అడ్లూరి ఆకాంక్షించారు.ఈ కార్య క్రమంలో టిజిటిడబ్లుఆర్ ఈఐఎస్, టిజిఈఎం ఆర్ఎస్ సెక్రటరీ, శ్రీమతి కె, సీతాలక్ష్మి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించిన జువ్వాడి నర్సింగ్ రావు

**చురకలు ప్రతినిధి, కోరుట్ల నవంబర్ 20 :** కోరుట్ల వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో పేస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని గురు వారం కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు పేస్ అధ్యక్షులు ఎలిశెట్టి భూమారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డితో కలిసి ప్రారంభించారు.ఈ సందర్భంగా నర్సింగ్ రావు మాట్లాడు తూ గత ప్రభుత్వంలో 44 కిలోల తూకం వేయగా ఇప్పుడు ప్రజా ప్రభు త్వంలో 41 కిలోలతో మాత్రమే తూకం కొనసాగుతుందని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం అంటే బడుగు బలహీన వర్గాల ప్రజలకు అండగా నిలిచే ప్రభుత్వం అని పేర్కొన్నారు రైతులు దళారుల వద్దకు వెళ్లి మోస పోకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించు కోవాలని సూచించారు. అలాగే రైతులకు కలుగుతున్న లాభాల ను వివరించారు గత ప్రభుత్వంతో పోలిస్తే ఈ ప్రభుత్వంలో రైతులు ఎకరాకు సుమారు రూ 5,000 వరకు లాభం పొందుతున్నారని తెలిపారు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వంలో పరిధాన్యం గ్రేడ్- A కి.రూ 2389 సాధారణ రకానికి రూ 2369 మద్దతు ధర అందిస్తున్నట్లు చెప్పారు సన్న రకం ధాన్యానికి క్వింటాలుకు రూ 500 బోనస్ కూడా ప్రభుత్వం అందజే స్తోందని వివరిం చారు.కొనుగోలు కేంద్రాల్లో రైతులకు



ఎలాంటి ఇబ్బందులు లేకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు ప్రజలు ప్రజాపాలనపై సంతృప్తిగా ఉన్నారని తాజాగా జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయంకూడా దీనికి నిదర్శనమని పేర్కొన్నారు కార్యక్రమంలో పేస్ చైర్మన్ ఎలిశెట్టి భూమారెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు రైతులు తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను పంపిణీ చేసిన జువ్వాడి నర్సింగ్ రావు

**-అర్హులందరికీ ఇళ్లు నిర్మాణం త్వరగా ప్రారంభించాలని సూచన**



**చురకలు ప్రతినిధి, కోరుట్ల నవంబర్ 20 :** కోరుట్ల పట్టణ సినారె భవనంలో గురువారం కోరుట్ల మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం ఆధ్వర్యంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా కోరుట్ల నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ జువ్వాడి నర్సింగ్ రావు హాజరై మండలానికి చెందిన 40 మంది లబ్ధిదారులకు ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలను అందజేశారు,ఈ సందర్భంగా మాట్లాడి న నర్సింగ్ రావు ఇందిరమ్మ ఇళ్ల కోసం ప్రొసీడింగ్ పత్రాలు పొందిన ప్రతి లబ్ధిదారు ఇంటి నిర్మాణాన్ని త్వరగా ప్రారంభించాలని సూచించారు. ప్రభుత్వం నిర్ణయించిన దశల వారీ నిర్మాణం జరిగినంత మేరకు నిధులు నేరుగా లబ్ధిదారుల ఖాతాలలో జమ అవుతాయని తెలిపారు అలాగే ఆయన గత ప్రస్తుత ఇళ్ల మంజూరు వివరాలను వివరించారు. కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పడిన తర్వాత కోరుట్ల పట్టణానికి 500 ఇళ్లు మండలానికి 502 ఇళ్లు మంజూరు చేశారని చెప్పారు.గతంలో ఇళ్ల నిర్మాణాలపై ప్రజలు ముందుకు రాకపోయినా ఇప్పుడు నిధులు నేరుగా ఖాతాల్లో జమవుతున్నందున ప్రతి ఒక్కరూ నిర్మాణాలపై దృష్టి పెడుతు న్నారని తెలిపారు.బీఆర్ఎస్ ప్రభుత్వకాలంలో కోరుట్ల నియోజక వర్గానికి కేవలం 600 డబుల్ బెడ్ రూం ఇళ్లు మాత్రమే మంజూరు చేసినప్పటికీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రజా ప్రభుత్వం ఏర్పాటు తర్వాత ఇప్పటికే 3,500 ఇందిరమ్మ ఇండ్ల ప్రొసీడింగ్ పత్రాలు అందజేయడం జరిగిందని పేర్కొన్నారు ఆయన మరో ముఖ్యమైన విషయం గుర్తు చేశారు స్వర్గీయ మాజీ మంత్రి జువ్వాడి రత్నాకర్ రావు కాలంలో కోరుట్ల పట్టణానికి ఏకంగా 4,500 ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేసిన చరిత్రను గుర్తుచేశారు.గత కాంగ్రెస్ ప్రభుత్వంలో ఇందిరమ్మ ఇల్లు లేని గ్రామం లేదని మళ్లీ అదే ప్రజా పాలన ఇప్పుడు అమలవుతోందని అన్నారు ప్రజా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను వివరించిన నర్సింగ్ రావు ఉచిత బస్సు ప్రయాణం 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ నూతన రేషన్ కార్డుల మంజూరు రేషన్ దుకాణాల ద్వారా సన్నబియ్యం పంపిణీ వంటి హామీలు అమలులో ఉన్నాయని తెలిపారు.ప్రతిపక్షాలు చేస్తున్న అసత్య ప్రచారాన్ని ఖండిస్తూ ఇటీవల జరిగిన జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ అభ్యర్థి నవీన్ యాదవ్ విజయం ప్రజలు కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం ఉంచుతున్నారనే సూచన అని అన్నారు అత్యంత ముఖ్యంగా ఈరోజు ప్రొసీడింగ్ పత్రాలు పొందిన లబ్ధిదారుల్లో ఎవరు ఇంటి నిర్మాణం త్వరగా ప్రారంభిస్తే వారికి ఆడబిడ్డ కట్నంగా రూ 10,116 సొంత ఖర్చుతో అందజేస్తానని నర్సింగ్ రావు ప్రకటించారు అలాగే ఇందిరా గాంధీ జయంతి సందర్భంగా రాష్ట్ర వ్యాప్తంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించిన కోటీ మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమాన్ని నియోజక వర్గంలో కూడా త్వరలో చేపడతామని తెలిపారు ఈకార్యక్రమం లో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు కొంతం రాజం మార్కెట్ కమిటీ చైర్మన్ పన్నాల అంజిరెడ్డి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు పెరుమాండ్ల సత్యనారాయణ ఏలేటి మహిపాల్ రెడ్డి కిసాన్ కాంగ్రెస్ ఉపాధ్యక్షులు శశిధర్ రెడ్డి వాసిద్ లింబాద్రి శంకర్ గౌడ్, నర్సయ్య నవీన్ రెడ్డి రాకేష్ రెడ్డి తదితరులు అలాగే లబ్ధిదారులు పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోళ్లలో వేగం పెంచాలి



**-అదనపు కలెక్టర్ బీ.ఎస్. లత**

**చురకలు విలేకరి ఎండపల్లి నవంబర్ 20 :** ధాన్యం కొనుగోళ్లను మరింత వేగవంతం చేసి, రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా అదనపు కలెక్టర్ (రెవిన్యూ) బీ.ఎస్. లత అధికారులను ఆదేశించారు. గురువారం ఆమె ఎండపల్లి మండలం గుల్లకోట, అంబారిపేట్ గ్రామాల ధాన్యం కొను గోలు కేంద్రాలు,రైస్ మిల్లులను ఆకస్మి కంగా తనిఖీ చేశారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలకు వచ్చిన ధాన్యాన్ని ఆలస్యం చేయకుండా అదే రోజు రైస్ మిల్లులకు తరలించా లని,కొనుగోలు వివరాలను వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని సూచిం చారు. రైతులకు కొనుగోలు కేంద్రాలలో అవసరమైన వసతులు సమకూర్చాలని, రైస్ మిల్లుల వద్ద ఎటువంటి జాప్యం లేకుండా దిగుమతి పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.హమాలీల కొరత వంటి సమస్యలు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో ఎండపల్లి తహశీల్దార్ ఎడ్ల అనిల్ కుమార్, సివిల్ సప్లై అధికారులు, సెంటర్ ఇంచార్జులు తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణ లక్ష్మికి "తహసీల్దార్" బ(ది)లి?

**-అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే.. హుజురాబాద్ తహసిల్దార్ బదిలీకి కారణమా?**



**(కోరెం సుధాకర్ రెడ్డి చురకలు ప్రతినిధి హుజురాబాద్)**

హుజురాబాద్ తహసిల్దార్ కోడెం కనకయ్య ఏడాదిన్నర తిరగకముందే బదిలీ అయ్యారు. ఉన్నట్టుండి అకస్మాత్తు గా ఆయన బదిలీ కావడం ఇటు రాజకీయ అటు అధికార వర్గాల్లో చర్చనీయాంశం అయింది.వేములవాడ కు చెందిన కోడెం కనకయ్య ఏడాదిన్నర గా ఇక్కడ తహసిల్దార్‌గా పని చేస్తున్నారు.ఆయనకు వివాదరహితునిగా మంచి అధికారిగా పేరు ఉంది. సమస్యల పరిష్కారానికి ఆయన కృషి చేశారు. తహసీల్దార్ కనకయ్య బదిలీకి అధికార పార్టీ నేతల ఒత్తిళ్లే కారణమని చర్చ జరుగుతోంది. హుజరాబాద్ లో బి ఆర్ ఎస్ పార్టీకి ప్రతినిత్యం వహిస్తున్న ఎమ్మెల్యే పాడి కౌశిక్ రెడ్డి ఉన్నారు. ఎమ్మెల్యే చేతుల మీదుగానే కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ జరుగు తోంది.గతంలో కళ్యాణ లక్ష్మి చెక్కుల పంపిణీ విషయంలో అధికారులు ప్రభుత్వం వ్యవహరించిన తీరుపై ఎమ్మెల్యే కౌశిక్ కోర్టుకు వెళ్లారు. ఎమ్మెల్యే చేతుల మీదుగానే చెక్కులను ఇవ్వాలని కోర్టు ఆదేశించింది. దీంతో అధికారులు ఆయన చేతుల మీదుగానే చెక్కులను లబ్ధిదారులకు అందజేస్తు న్నారు.కాగా తాజాగా ఇటీవల (మంగళవారం)ఎమ్మెల్యే కౌశిక్ రెడ్డి క్యాంపు కార్యాలయంలో ఆయన చేతుల మీదుగా లబ్ధిదారులకు కళ్యాణ లక్ష్మి షాదీ ముబారక్ చెక్కుల పంపిణీ జరిగింది.దీనికి రెవిన్యూ అధికారులు సిబ్బంది హాజరయ్యారు.అయితే అంతకు ముందు రోజే చెక్కుల పంపిణీ నిలిపివేయాలని అధికార పార్టీ నుండి ఒత్తిడి వచ్చినట్టు తెలుస్తోంది. కానీ అప్పటికే లబ్ధిదారులకు అధికారులు సిబ్బంది సమాచారం ఇవ్వడంతో ఆ కార్యక్రమాన్ని నిలిపివేయలేకపోయారు. తద్వారా అధికార పార్టీ నేతలకు ఇది మింగుడు పడలేదు.తాము వద్దని చెప్పినా చెక్కులు ఎలా ఇచ్చారని భావించిన అధికార పార్టీ నేతలు ఈ విషయాన్ని సీరియస్ గా భావించినట్టు తెలుస్తోంది.దీంతో గురువారం అకస్మాత్తుగా జిల్లా కలెక్టర్ నుండి తహసిల్దార్ బదిలీ ఉత్తర్వులు నిలబడ్డాయి. అధికార పార్టీ నేతల విజ్ఞప్తి మేరకు ఓ మంత్రి ఆదేశాల మేరకే బదిలీ జరిగినట్టు.. స్థానిక రాజకీయ,అధికార ప్రచారం జరుగుతోంది.స్థానికంగా బిఆర్ఎస్ ఎమ్మెల్యే ఉండడం, అధికారులకు ఇటు అధికారపక్షం అటు ప్రతిపక్ష నుండి, అరవైపు కేంద్రంలో అధికారంలో ఉన్న బిజెపి నేతలనుండి పనుల కోసం ఫోన్లు రావడం, ఒత్తిళ్లు పెరగడంతో.. ఎవరి మాట వినాలో తెలియని పరిస్థితి ఏర్పడుతోంది. అధికార పార్టీ నేతల మాట వినాలా? లేక ఎమ్మెల్యే మాట వినాలో తెలియని సందిగ్ధ పరిస్థితి అధికార యంత్రాంగం ఎదుర్కొంటు న్నట్టు తెలుస్తోంది.ఏది ఏమైనా తహసిల్దార్ కనకయ్య బదిలీ విషయం ఆసక్తికర చర్చకు దారితీస్తోంది.